

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 14-06-2025 | సంపుటి - 24 | సంచిక - 43 | రూ : 4 | పేజీలు : 8


- ఇజ్రాయెల్- ఇరాన్ మధ్య భీకర యుద్ధం
- ఇరాన్ అణు కేంద్రాలు, క్షిపణి స్థావరాలు, సైనిక ప్రధాన కార్యాలయంపై విరుచుకుపడిన ఇజ్రాయెల్
- 200కుపైగా యుద్ధ విమానాలతో వందకుపైగా లక్ష్యాలపై బాంబుల వర్షం
- ఇరాన్ భూభాగంలోకి రహస్యంగా డ్రోన్లు తరలించి కచ్చితత్వంతో దాడులు
- ముగ్గురు కీలక సైన్యాధికారులు, అణుశాస్త్రవేత్తలు మృతి
- 78 మంది పౌరుల మరణం... 329 మందికి గాయాలు
- తొలుత 100 డ్రోన్లతో ప్రతిదాడికి దిగిన టెహ్రాన్, తర్వాత వందల కొద్దీ క్షిపణుల ప్రయోగం
- టెల్ అవీవ్, జెరూసలేంలో పేలుళ్లు.. పలువురికి గాయాలు
- రెండు ఇజ్రాయెల్ యుద్ధ విమానాలను కూల్చిన ఇరాన్!
- తాజా ఘర్షణతో పెట్రోల్, డీజిల్ ధరలకు రెక్కలు

# భగ్గుమన్న పశ్చిమాసియా

దుబాయ్, జెరూసలేం: పశ్చిమాసియా మరోసారి భగ్గుమంది. ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య తీవ్రస్థాయిలో యుద్ధం మొదలైంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ శుక్రవారం భీకరస్థాయిలో విరుచుకుపడగా.. ఇరాన్ సైతం అంతేస్థాయిలో ప్రతిదాడులు చేసింది. తొలుత ఇరాన్ అణు, సైనిక స్థావరాలు, సైనిక ఉన్నతాధికారులు లక్ష్యంగా వందల క్షిపణులు, డ్రోన్లతో ఇజ్రాయెల్ దాడిచేసింది. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రారంభమైన దాడులు శుక్రవారం సాయంత్రం కూడా కొనసాగాయి. ఈ భీకర పోరులో కీలకమైన మిలిటరీ నాయకత్వాన్ని, అణుశాస్త్రవేత్తలను ఇరాన్ కోల్పోయింది. ఆ దేశ అణు కేంద్రాల్లోని మౌలిక వసతులు



తీవ్రంగా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ దాడుల్లో 78 మంది ఇరాన్ పౌరులు మృతి చెందారు. 329 మంది గాయపడ్డారు. రెండు ఇజ్రాయెల్ యుద్ధ విమానాలను కూల్చినట్లు

తరువాయి 2లో



## 16న...
# రైతు భరోసా

- పెట్టుబడి సాయం జమకు ప్రభుత్వ కసరత్తు
- అదే రోజు రైతులతో ముఖాముఖిలో పాల్గొననున్న సీఎం

హైదరాబాద్: రాష్ట్రంలో వానాకాలం సాగు సీజన్‌కు 'రైతు భరోసా' కింద ఇచ్చే పెట్టుబడి సాయాన్ని ఈ నెల 16న విడుదల

తరువాయి 2లో

## 18 నుంచి సీపీగెట్
# దరఖాస్తుల స్వీకరణ

- ఆగస్టు తొలివారంలో ఆన్‌లైన్ పరీక్షలు




హైదరాబాద్: ఉమ్మడి పీజీ ప్రవేశ పరీక్ష(సీపీగెట్) దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని ఏడు సంప్రదాయ వర్సిటీలతో పాటు జేఎన్‌టీయూహెచ్‌లోని పీజీ కోర్సుల్లో సీట్ల భర్తీకి నిర్వహించనున్న సీపీగెట్ నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, ఓయూ వీసీ ఎం.కుమార్, కన్వీనర్ ఐ.పాండురంగారెడ్డి తదితరులు శుక్రవారం సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ... ''డిగ్రీ పరీక్షల వాయిదా నేపథ్యంలో సీపీగెట్ నోటిఫికేషన్ విడుదల ఆలస్యమైంది. ఆలస్య రుసుం లేకుండా జులై 17 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.2 వేల ఆలస్య రుసుంతో జులై 28 వరకు అవకాశముంది. ఆగస్టు తొలి వారంలో ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తాం'' అని తెలిపారు. ఓయూ వీసీ కుమార్ మాట్లాడుతూ...''నిరుడు మొత్తం 297 పీజీ కళాశాలల్లో 46,742

తరువాయి 2లో

## మరోమారు
# అనిశా ముందుకు కేటీఆర్!

- సోమవారం హాజరు కావాలంటూ నోటీసులు

హైదరాబాద్: ఫార్ములా ఈ రేసు కేసు దర్యాప్తులో భాగంగా భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)కు అనిశా మరోమారు నోటీసులు జారీ చేసింది. ఫార్ములా ఈ రేసుకు సంబంధించి పూర్తి అవగాహన ఉన్నందున దీనిపై తాము నమోదు చేసిన కేసు దర్యాప్తులో భాగంగా విచారణకు హాజరుకావాలంటూ కేటీఆర్‌కు అవినీతి నిరోధకశాఖ డీఎస్పీ మజీద్ అలీఖాన్ శుక్రవారం నోటీసు జారీ చేశారు. ఈ నెల 16వ తేదీ సోమవారం

తరువాయి 2లో





## జూన్ 23 నుంచి
# 'సుపరిపాలనలో తొలి అడుగు'

- నెల రోజులు ఇంటింటికీ వెళ్లి కూటమి విజయాల్ని వివరించండి
- ఈ నెల 20న 'అన్నదాతా-సుఖీభవ'
- జులైలో పార్టీ నేతలు, కార్యకర్తలకు శిక్షణ
- 'తల్లికి వందనం' నిధుల జమపై సర్వత్రా సంతృప్తి
- టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

అమరావతి: 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా జూన్ 23 నుంచి నెల రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సాధించిన విజయాలు, అమలుచేసిన పథకాల్ని వివరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. లీడర్ నుంచి కేడర్ వరకు ఈ విజయయాత్రలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జులైలో కార్యకర్తలు, నేతలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 20న అన్నదాతాసుఖీభవ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు. 'తల్లికి వందనం' నిధులు జమ అవుతుండడంతో సర్వత్రా సంతృప్తి వ్యక్తమవుతోందన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై తెదేపా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యనేతలు సహా గ్రామస్థాయి కార్యకర్తల వరకు అందరితో

తరువాయి 2లో

## గురుకులాల్లోనూ
# డే స్కాలర్ చదువు అందిద్దాం

- సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయండి
- పట్టణాలు, నగరాల్లో ప్రభుత్వ పాఠశాలలు పెంచండి
- విద్యాశాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ''నాణ్యమైన భోజనం, ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు అందిస్తుండటంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు గురుకులాల

తరువాయి 2లో



# పార్టీలకతీతంగా పేదలకు సంక్షేమ పథకాలు



* మూడున్నరేళ్లలో మరో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు: మంత్రి పొంగులేటి

పెద్దపల్లి : 'పార్టీలకతీతంగా ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తాం.. మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం.. రెండు, మూడు విడతల్లో గులాబీ కండువా కప్పుకొన్న అర్హులకూ కేటాయిస్తాం' అని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల నివాసాలు మంజూరు చేశామని.. వచ్చే మూడున్నరేళ్లలో మరో

తరువాయి 2లో

## 18 నుంచి సీపీగెట్ దరఖాస్తుల స్వీకరణ

(మొదటిపేజీ తరువాయి)

సీట్లుండగా... 21,560 భర్తీ అయ్యాయి. ఈసారి మరో 4,000 వరకు కొత్తగా సీట్లు పెరుగుతాయి. ఓయూ, మహిళా వర్సిటీలకు బోధన, బోధనేతర సిబ్బంది విభజన ప్రక్రియపై ఇటీవల సమావేశం నిర్వహించాం. వర్సిటీ ఎంపిక కోసం సిబ్బందికి ఆప్షన్ ఇస్తాం'' అని చెప్పారు. కన్వీనర్ పాండురంగారెడ్డి మాట్లాడుతూ... ''ఈసారి 15% స్థానికేతర కోటా కింద ఏపీ విద్యార్థులకు అవకాశం ఉండదు. నేషనల్ ఇంటిగ్రేషన్ కోటా (ఎన్ఐక్యూ) కింద 20% పీజీ కోర్సుల్లో ఇతర రాష్ట్రాల విద్యార్థులు సీట్లు పొందొచ్చు. దివ్యాంగుల రిజర్వేషన్ 3 నుంచి 5 శాతానికి పెరుగుతుంది. కొత్తగూడెంలో ఎర్త్ సైన్స్ వర్సిటీపై చట్టం వస్తే దాన్ని కూడా సీపీగెట్‌లో చేరుస్తాం'' అని వెల్లడించారు.

**సెట్ పొరపాట్లు పునరావృతం కాకుండా చూస్తాం**

ఉస్మానియా విశ్వవిద్యాలయం 2024 సెప్టెంబరులో రాష్ట్ర అర్హత పరీక్ష (టీజీ సెట్ 2024) నిర్వహించగా... చరిత్ర సబ్జెక్టులో 150 ప్రశ్నలకు ఏకంగా 26 తప్పుగా ఇచ్చారు. దానిపై రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఓయూను రెండుసార్లు వివరణ కోరినా సమాధానమివ్వలేదు. అలాంటప్పుడు సీపీగెట్‌ను మళ్లీ ఓయూకే ఎందుకు ఇచ్చారన్న ప్రశ్నకు ఛైర్మన్ సమాధానమిస్తూ... తప్పులు జరిగిన మాట వాస్తవమేనని, పునరావృతం కాకుండా చూస్తామన్నారు. దీనిపై ఓయూ వీసీ మాత్రం సమాధానం చెప్పకుండా మిన్నకుండిపోవడం గమనార్హం. కార్యక్రమంలో విద్యామండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, శాతవాహన వర్సిటీ వీసీ ఉమేశ్‌కుమార్, చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీ వీసీ సూర్య ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## 16న రైతు భరోసా

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ మేరకు రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసేందుకు కసరత్తు చేపట్టింది. ఇటీవల జరిగిన వ్యవసాయశాఖ సమీక్ష, మంత్రిమండలి సమావేశాల్లో రైతు భరోసా సాయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్చించారు. పథకానికి అయ్యే వ్యయంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆర్థికశాఖ అంచనాలను రూపొందించి సీఎంకు నివేదించగా.. నిధుల విడుదలకు ఆయన ఆమోదించినట్లు తెలుస్తోంది. రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేసేందుకు.. లబ్ధిదారుల జాబితాను వ్యవసాయశాఖ సిద్ధం చేస్తోంది. 16వ తేదీనే మంత్రులతో సీఎం సమావేశమై వివిధ అంశాలపై చర్చించనున్నట్లు తెలిసింది. అదే రోజు సీఎం వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియం నుంచి 'రైతునేస్తం' కార్యక్రమం కింద వివిధ జిల్లాల రైతులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రతి మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం కింద రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) నిర్వహిస్తోంది. ఇందులో అధికారులు, శాస్త్రవేత్తలు.. రైతులకు సలహాలు, సూచనలు అందిస్తూ సందేహాలను నివృత్తి చేస్తున్నారు. సీఎం పాల్గొనే ముఖాముఖి కార్యక్రమం 16న మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా 1500 రైతు వేదికల్లో ఇది ప్రత్యక్ష ప్రసారమవుతుంది. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష, కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని ఆయన ఆదేశించారు.

**మరో వెయ్యి రైతు వేదికల్లో వీసీ సౌకర్యం**

తెలంగాణలోని రైతు వేదికల్లో దృశ్యశ్రవణ (వీడియో కాన్ఫరెన్సింగ్‌వీసీ) సౌకర్యం విస్తరించనుంది. రాష్ట్రంలో మొత్తం 2601 రైతు వేదికలు ఉండగా... ప్రస్తుతం 500 చోట్ల వీసీ సదుపాయం ఉంది. కొత్తగా మరో వెయ్యి కేంద్రాల్లో ఈ సౌకర్యం కల్పించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ. 50 కోట్లు విడుదల చేయగా.. టీవీలు, కంప్యూటర్లు ఏర్పాటు చేసి, వీడియో కాన్ఫరెన్సింగ్ పరికరాలు అమర్చారు. ఈ నెల 16న సీఎంతో ముఖాముఖి సందర్భంగా కొత్త కేంద్రాల్లో వీసీ సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఈ సంవత్సరాంతానికి మిగిలిన 1101 రైతు వేదికల్లోనూ వీసీ సేవలు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది.

## పార్టీలకతీతంగా పేదలకు సంక్షేమ పథకాలు

(మొదటిపేజీ తరువాయి)

20 లక్షలు కేటాయిస్తామని చెప్పారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. శుక్రవారం ఆయన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి పెద్దపల్లి జిల్లాకేంద్రంలో రెండు పడక గదుల ఇళ్ల సముదాయం, మహిళా, ట్రాఫిక్, గ్రామీణ ఠాణాలు, ఎలిగేడు మండలకేంద్రంలో పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్ వినియోగదారులకు సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తుండగా, అందులో పురుగులున్నాయంటూ ప్రచారం చేస్తున్నారన్నారు. పదేళ్ల పాలనలో పేదల సొంతింటి కల తీర్చలేని భారాసకు తమ పాలనను విమర్శించే హక్కు లేదన్నారు.

## బైక్ రేసింగ్‌లో తెలుగు తేజం

## డబుల్ చాంపియన్ సాయి దీప్




అమెరికా, 13 జూన్ (ప్రజాస్ఫూర్తి ):క్యాలిఫోర్నియాలో సిఆర్ఎ 2025 రేసింగ్ సీజన్ ఉత్కంఠభరితంగా సాగుతున్న వేళ, తెలుగు యువ రేసర్ ఎం. సాయి దీప్ రెండు వర్గాల్లోనూ (400 జీటి, 400 సూపర్‌బైక్) అగ్రస్థానంలో దూసుకెళ్తున్నారు. ఎంఎస్డి రేసింగ్ (నార్త్ కాలిఫోర్నియా) తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న సాయి దీప్ ఇప్పటికే ముగిసిన మూడు రౌండ్లలో అద్భుతమైన రేసింగ్ నైపుణ్యంతో మూడు వరుస పోడియం విజయాలు సాధించారు. చివరి దశ రేసు జూన్ 2729 మధ్య బటన్‌విల్లో జరగనుండగా, డబుల్ టైటిల్‌కి ఆయన దూకుడు ఆశాజనకంగా నిలుస్తోంది. మహీ రేసింగ్ టీమ్ ఇండియా సహ వ్యవస్థాపకుడిగా సాయి దీప్ 2013లో ప్రపంచ చాంపియన్‌షిప్ గెలుపులో కీలక పాత్ర పోషించారు. 2010లో మోటోజీపీ సపోర్ట్ రేసులో అర్హత పొందిన తొలి భారతీయుడిగా గుర్తింపు పొందిన ఆయన, మోటో అమెరికా, వరల్డ్ సూపర్ బైక్, ఫార్ములా 1, నాస్కార్ వంటి ప్రఖ్యాత రేసింగ్ ఈవెంట్లలో పాల్గొన్నారు. ఇంగ్లాండ్, కాలిఫోర్నియాలో శిక్షణ పొందిన ఈ రేసర్‌కి లగునా సెకా, విల్లో స్ప్రింగ్స్, థండర్ హిల్ వంటి టాప్ ట్రాక్‌లపై విశేష అనుభవం ఉంది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాల ప్రచారకుడిగా కూడా సాయి దీప్ చురుగ్గా వ్యవహరిస్తున్నారు. తిరుపతిలో జన్మించి, హైదరాబాద్, చెన్నైలో చదువుకున్న సాయి దీప్ భారత వీధుల్లో బైక్‌పై ప్రారంభమైన తన ప్రయాణాన్ని అంతర్జాతీయ రేసింగ్ వరల్డ్‌లో గొప్ప విజయాల్లోకి మలచుకున్నారు.

# భగ్గుమన్న పశ్చిమాసియా

(మొదటిపేజీ తరువాయి)

ఇరాన్ ప్రకటించింది. అయితే, దీనిని టెల్ అవీవ్ వర్గాలు తోసిపుచ్చాయి. ప్రతీకార దాడులకు దిగిన ఇరాన్ తొలుత భారీ సంఖ్యలో డ్రోన్లను ఇజ్రాయెల్‌పైకి పంపింది. ఆ తర్వాత శుక్రవారం రాత్రి వందల సంఖ్యలో క్షిపణులను ప్రయోగించింది. దీంతో టెలి అవీవ్, జెరూసలేంలలో పలు చోట్ల పేలుళ్లు జరిగాయి. పదుల సంఖ్యలో ఇజ్రాయెలీలు గాయపడ్డారు. పలు భవంతులు దెబ్బతిన్నాయి. టెల్ అవీవ్‌లోని ఇజ్రాయెల్ రక్షణ శాఖ ప్రధాన కార్యాలయం వద్ద పేలుళ్లు సంభవించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఇరాన్ క్షిపణులను అడ్డుకోవడంలో ఇజ్రాయెల్‌కు అమెరికా సహకారాన్ని అందిస్తోంది. ఇజ్రాయెల్‌లోని పలు ప్రాంతాల లక్ష్యంగా శుక్రవారం రాత్రి రెండు వందలకు పైగా క్షిపణులు టెహ్రాన్ వైపు నుంచి దూసుకొచ్చాయని స్థానిక మీడియా వర్గాలు పేర్కొన్నాయి. పౌర నివాసాలపై దాడులు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇరాన్‌ను ఇజ్రాయెల్ రాజకీయ పార్టీల నేతలు హెచ్చరించారు. ఇరాన్ ఎదురుదాడిలో నష్టం వివరాలను ఇజ్రాయెల్ అధికారికంగా ప్రకటించలేదు. దేశంలో మాత్రం ఆత్యయిక పరిస్థితిని విధించింది. దేశవ్యాప్తంగా సైన్యాన్ని అప్రమత్తం చేసింది. ఇజ్రాయెల్ దాడులపై ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేని మండిపడ్డారు. శిక్ష తీవ్రంగా ఉంటుందని ఇజ్రాయెల్‌పై హూంకరించారు. జాతినుద్దేశించి ప్రసంగించిన ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. మరోవైపు ఇప్పటికైనా తమతో అణు ఒప్పందం కుదుర్చుకోవాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు సూచించారు. తాజా ఘర్షణపై ప్రపంచ దేశాలు స్పందించాయి. తక్షణమే ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని ఇరుదేశాలకు హితవుపలికాయి. ఇరాన్ ప్రతిదాడికి దిగడంతో పశ్చిమాసియాకు యుద్ధ నౌకలను, సైనిక వ్యవస్థలను అమెరికా తరలిస్తోంది. శుక్రవారం అంతర్జాతీయ మార్కెట్‌లో పెట్రోలు, డీజిల్ ధరలు 12 శాతానికి పైగా పెరిగాయి. ఇరాన్ కాలమానం ప్రకారం.. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇజ్రాయెల్ తొలుత దాడులు చేసింది. శుక్రవారం ఉదయం, రాత్రి కూడా దాడులు కొనసాగించినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఇరాన్‌లోని అణుకేంద్రాలు, సైనిక ప్రధాన కార్యాలయం, క్షిపణి స్థావరాలు లక్ష్యంగా టెల్ అవీవ్ వ్యూహాత్మకంగా ఈ ప్రణాళికను అమలుచేసినట్లు తెలుస్తోంది. ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలను ముందుగా దెబ్బతీసిందని, దీని కోసం ఆ దేశంలోకి రహస్యంగా డ్రోన్లను తరలించి, అక్కడే ఓ స్థావరాన్ని ఏర్పాటు చేసుకుని కోవర్టు ఆపరేషన్ నిర్వహించిందని ఇజ్రాయెల్ వర్గాలు వెల్లడించాయి. ఆ తర్వాత యురేనియం శుద్ధి కేంద్రాలపై రెండు వందలకు పైగా యుద్ధ విమానాలు, క్షిపణులతో పలుమార్లు దాడులు చేసినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇరాక్ కీలక అణు కేంద్రం ఉన్న నతాంజ్‌లోనూ పేలుళ్లు సంభవించాయి. నేలమాళిగలో నిర్వహిస్తోన్న మరో రెండు అణు శుద్ధి కేంద్రాలు... ఫోర్డో, ఇస్ఫహాన్ పైనా శుక్రవారం రాత్రి ఇజ్రాయెల్ దాడి చేసింది.

# గురుకులాల్లోనూ డే స్కాలర్ చదువు అందిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

వైపు మొగ్గు చూపుతున్నారు. అలాంటిచోట్ల మౌలిక వసతులను సంపూర్ణంగా వినియోగించుకునేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చి చదువుకొని... ఇళ్లకు వెళ్లేలా డే స్కాలర్లకూ అవకాశం ఇవ్వడంపై అధ్యయనం చేయండి'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ... ''కోరుకున్న విద్యార్థులందరికీ గురుకులాల్లో సీట్లు ఇవ్వలేం. అయితే, డే స్కాలర్లకు సైతం గురుకులాల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించవచ్చు. తర్వాత వారు ఇళ్లకు వెళ్లి కుటుంబంతో గడపొచ్చు. దీనిపై పరిశీలించండి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర విభాగాల కింద ఇంటర్ వరకు ఉన్న వివిధ విద్యాసంస్థలను హేతుబద్ధీకరించి ప్రతి పాఠశాలలో నిర్దిష్ట సంఖ్యలో విద్యార్థులు ఉండేలా చూడాలి. ఈ క్రమంలోనే రాష్ట్రంలో 20 మంది కన్నా ఎక్కువ పిల్లలున్న చోట కొత్తగా ప్రస్తుత ఏడాది నుంచే 571 ప్రభుత్వ పాఠశాలలను ప్రారంభిస్తున్నాం.

**ఆ స్థలాల్లో కొత్త పాఠశాలలు**

రాష్ట్రంలో పట్టణీకరణ వేగంగా జరుగుతున్నందున పురపాలక శాఖతో సమన్వయం చేసుకొని కొత్త పాఠశాలలను ఏర్పాటు చేయాలి. హెచ్ఎండీఏ, మున్సిపల్ లేఅవుట్లలో సామాజిక వసతుల కోసం గుర్తించిన/వదిలేసిన స్థలాల్లో వాటిని ప్రారంభించండి. హైస్కూల్ స్థాయి నుంచే విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తే ప్రయోజనం ఉంటుంది. మనిషి జీవితంలో కుటుంబం, సమాజాల ప్రాధాన్యాన్ని, వాటిపై ఉండాల్సిన బాధ్యతను పిల్లలకు తెలిసేలా కౌన్సెలింగ్ ఇప్పిస్తే వారు బాధ్యతాయుత పౌరులుగా మారతారు'' అని అభిప్రాయపడ్డారు. అద్దె చెల్లించని కారణంగా గురుకులాల భవనాలకు వాటి యజమానులు తాళాలు వేస్తున్న విషయం తనకెందుకు చెప్పలేదని అధికారులను సీఎం ప్రశ్నించినట్లు సమాచారం. సమీక్షకు కొందరు సరిగా సన్నద్ధమై రాలేదని ఆయన అసంతృప్తి వ్యక్తంచేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఎండీ గణపతిరెడ్డి... వీరనారి చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీ భవనాల ఆకృతుల నమూనాలను చూపించగా... సీఎం రేవంత్‌రెడ్డి వాటికి కొన్ని మార్పులు సూచించినట్లు సమాచారం. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నరసింహారెడ్డి, ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

**ఆ చట్టం అమలుపైనా చర్చ!**

విద్యా హక్కు చట్టంలోని 12(1) (సి) సెక్షన్‌ను అమలు చేస్తామని, దాని ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25% సీట్లను పేద విద్యార్థులకు కేటాయించేలా చూస్తామని, ఫీజులను తామే చెల్లిస్తామని ప్రభుత్వం ఇప్పటికే హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో సీఎం సమీక్షలో దానిపైనా చర్చించినట్లు సమాచారం. కర్ణాటక తరహాలో ప్రభుత్వ పాఠశాలలు లేనిచోట్ల మాత్రమే విద్యార్థులకు ప్రైవేట్‌లో చదువుకునే అవకాశం ఇవ్వడంపై ప్రభుత్వం యోచిస్తోంది. ఈ క్రమంలోనే కొత్తగా ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేస్తే... సమస్యే ఉండదని భావించి 571 పాఠశాలలను ప్రారంభించాలని నిర్ణయించినట్లు భావిస్తున్నారు.

# మరోమారు అనిశా ముందుకు కేటీఆర్!

(మొదటిపేజీ తరువాయి)

ఉదయం 10 గంటలకు తమ ఎదుట హాజరుకావాలని అందులో పేర్కొన్నారు. ఈ కేసులో అనిశా అధికారులు గతంలోనే కేటీఆర్‌తో పాటు ఇతర నిందితులుగా ఉన్న పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ పూర్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలను కూడా విచారించింది. తర్వాత లండన్‌లో ఉన్న ఫార్ములా ఈ ఆపరేషన్స్ సీఎఫ్‌వోను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించింది. ఇదే కేసులో కేటీఆర్‌ను మరోసారి విచారించేందుకు గత నెల 29వ తేదీనే తమ ఎదుట హాజరుకావాలని అనిశా అధికారులు నోటీసులు జారీ చేశారు. కానీ విదేశీ ప్రయాణం ఉన్నందున ఆ తేదీలో తాను విచారణకు రాలేనని, తిరిగి వచ్చిన తర్వాత హాజరవుతానని కేటీఆర్ లిఖితపూర్వకంగా అనిశాకు తెలిపారు. ఆ మేరకు అనిశా అధికారులు తాజాగా కేటీఆర్‌కు నోటీసులు జారీ చేశారు. దీంతో కొంతకాలంగా మరుగునపడిన ఫార్ములా ఈ కేసు మరోమారు తెరపైకి వచ్చింది.

*** కేటీఆర్‌కు నోటీసులు కక్ష సాధింపే: హరీశ్‌రావు**

ఫార్ములా ఈ కేసులో మరోసారి కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వడం రాజకీయ కక్ష సాధింపేనని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. ''తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రేవంత్‌రెడ్డి దర్యాప్తు సంస్థలను యథేచ్ఛగా దుర్వినియోగం చేస్తున్నారనడానికి తాజా నోటీసులే నిదర్శనం. ఎన్నికల్లో ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయాలని నిరంతరం ప్రశ్నిస్తున్న కేటీఆర్ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకే రేవంత్‌రెడ్డి ఈ నోటీసులు పంపించారు. ఎన్ని రకాలుగా వేధించినా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం మాత్రం ఆపేది లేదు'' అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కేటీఆర్‌కు నోటీసులివ్వడాన్ని భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత 'ఎక్స్' వేదికగా ఖండించారు. ఎన్ని కుట్రలు పన్నినా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతూనే ఉంటామని ఆమె పేర్కొన్నారు.

*** ఎన్ని నోటీసులిచ్చినా వైఫల్యాల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టం: కేటీఆర్**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన పరిపాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు.. నోటీసుల పేరుతో ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఎన్ని నోటీసులిచ్చినా.. తెలంగాణ గొంతుకగా పోరాడుతూనే ఉంటామని, వైఫల్యాల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఫార్ములా ఈ కేసులో నోటీసులపై ఆయన ఒక ప్రకటనలో స్పందించారు. ''ఫార్ములా ఈ రేసు కోసం గత భారాస ప్రభుత్వం హెచ్ఎండీఏ అధికారిక బ్యాంకు ఖాతా నుంచి.. పారదర్శకంగా ఫార్ములా ఈ సంస్థ ఎకౌంట్‌కు రూ.44 కోట్లు పంపించింది. ఆ డబ్బులు ఇప్పటికీ ఆ సంస్థ ఖాతాలోనే ఉన్నా, వాటిని వెనక్కి రప్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. ఎన్నిసార్లు నోటీసులిచ్చినా.. చట్టాలను గౌరవించే పౌరుడిగా తప్పకుండా విచారణకు వెళ్తాను. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కూడా ఏసీబీ కేసు ఉంది. ఇద్దరం జడ్జి సమక్షంలో.. లై డిటెక్టర్ పరీక్షను ఎదుర్కొందాం. దీనికి రేవంత్‌రెడ్డి సిద్ధమేనా?'' అని కేటీఆర్ ప్రశ్నించారు.

# జూన్ 23 నుంచి 'సుపరిపాలనలో తొలి అడుగు'

(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం ఆయన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పార్టీ సంస్థాగత కమిటీలు పూర్తిచేయాలని శ్రేణులకు సూచించారు. ''అందరి అభిప్రాయాల్ని పరిగణనలోకి తీసుకొని కమిటీల్లో స్థానం కల్పించండి. కుటుంబ సాధికార సారథిగా ఉంటేనే ఎవరికైనా పదవులు. ప్రజలకు మనం ఏం చేశామో చెప్పడంతో పాటు వైకాపా దుష్ప్రచారాల్ని తిప్పికొట్టాలి. మన విజయాల్ని తట్టుకోలేని ప్రత్యర్థులు మహిళల్ని అవమానిస్తున్నారు'' అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రోజూ పార్టీకి సమయం ఇవ్వండి**

రోజూ పార్టీ కార్యక్రమాలకు సమయం కేటాయించాలని, ప్రజలతో కలుపుగోలుగా మెలగాలని ఎమ్మెల్యేలకు చంద్రబాబు సూచించారు. ''కార్యకర్తల్ని నాయకులుగా తీర్చిదిద్దుతాం. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వాళ్లు చేసిన సేవలు వెలకట్టలేనివి. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. వైకాపా ప్రభుత్వం విచ్చలవిడి అప్పులతో రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టినా ముఖ్యపథకాలన్నీ అమలుచేస్తున్నాం. 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం కింద రూ.పది వేల కోట్లు ఇచ్చినా బుద్ధి, జ్ఞానం లేకుండా వైకాపా వాళ్లు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. వాటిని తిప్పికొట్టండి. కూటమి ప్రభుత్వం చేసే ప్రతి మంచిపనినీ ప్రజల్లోకి తీసుకువెళ్లండి'' అని చంద్రబాబు వివరించారు.

*** 2 కోట్ల మంది అనుకున్నాం... 2.21 కోట్ల మంది నమోదయ్యారు**

యోగాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా రెండు కోట్ల మందితో నిర్వహించాలని సంకల్పిస్తే... 2.21 కోట్ల మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని చంద్రబాబు వివరించారు. ''ఇది మనందరి కార్యక్రమం. ఏపీని ప్రపంచపటంలో పెట్టేందుకు చేపట్టిన ఉద్యమమిది. విశాఖలో 5లక్షల మందితో ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నాం'' అని చంద్రబాబు పేర్కొన్నారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా యోగా సన్నద్ధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. పార్టీ నాయకులు, కార్యకర్తలు వాటిలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

*** సీఎంతో సినీరంగ ప్రముఖుల భేటీ రేపు**

సినిమా రంగానికి చెందిన ప్రముఖులు సీఎం చంద్రబాబుతో ఆదివారం సాయంత్రం ఉండవల్లిలోని ఆయన నివాసంలో భేటీ కానున్నారు. నిర్మాతలు, దర్శకులు, సినీ నటులు దాదాపు 2030 మంది ముఖ్యమంత్రిని కలవనున్నారు. ఈ భేటీకి ముందు సినీరంగ ప్రముఖులంతా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో సమావేశమవనున్నట్లు సమాచారం.

*** 16న విశాఖకు ముఖ్యమంత్రి చంద్రబాబు**

ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 16న విశాఖపట్నం వెళ్లనున్నారు. ఈ నెల 21న విశాఖలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా డే సన్నాహాలపై ఆయన మంత్రులు, అధికారులతో సమీక్షిస్తారు. ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు ఐదు లక్షల మందితో తలపెట్టిన ఆ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటున్నారు. దీంతో ఆ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. కార్యక్రమ ఏర్పాట్లను సీఎం సోమవారం సమీక్షించడంతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలోనూ పాల్గొంటారని సమాచారం. శుక్రవారం ఆయన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పార్టీ సంస్థాగత కమిటీలు పూర్తిచేయాలని శ్రేణులకు సూచించారు. ''అందరి అభిప్రాయాల్ని పరిగణనలోకి తీసుకొని కమిటీల్లో స్థానం కల్పించండి. కుటుంబ సాధికార సారథిగా ఉంటేనే ఎవరికైనా పదవులు. ప్రజలకు మనం ఏం చేశామో చెప్పడంతో పాటు వైకాపా దుష్ప్రచారాల్ని తిప్పికొట్టాలి. మన విజయాల్ని తట్టుకోలేని ప్రత్యర్థులు మహిళల్ని అవమానిస్తున్నారు'' అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కార్పొరేషన్ ఏర్పాటు వలన ప్రజల పథకాలు హక్కులు హుష్ కాకి

*** సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆవేదన**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం కార్పొరేషన్ వల్ల గ్రామీణ ప్రాంతంలో ఉండే పథకాలు హక్కులను కోల్పోతారని దీనితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐ ఎఫ్ టి యు కార్యాలయం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో కొత్తగూడెం కార్పొరేషన్ లో 60 డివిజన్లు చేస్తూ ముసాయిదా విడుదల చేశారు దీనితో సుజాతనగర్ లోని ఏడు గ్రామపంచాయతీలను కార్పొరేషన్ లో విలీనం చేశారు దీనివలన అక్కడ ఉన్నటువంటి ఆదివాసి గిరిజన ప్రజలు వెనుకబడిన ప్రజలు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. కార్పొరేషన్ వలన రియల్ ఎస్టేట్ దందా వ్యాపార వర్గాలకు పెట్టుబడిదారులకు మాత్రమే లాభం చేకూరుతుంది తప్పితే నిజమైన ప్రజలకి ఎలాంటి ప్రయోజనం లేదని వారన్నారు. కార్పొరేషన్ వలన ఏజెన్సీలో హక్కులను,అలవెన్సులను,కోల్పోతారని గిరిజనేతరులకు ఎక్కువగా ఉపయోగపడే విధంగా ఈ కార్పొరేషన్ ఉంటుందని వారు అన్నారు. ప్రధానంగా ఉన్నటువంటి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు కోల్పోతారని వ్యవసాయ భూములను కోల్పోయి రియల్ ఎస్టేట్ భూములుగా మార్చి భూదంగ చేస్తారని ఇది పెట్టుబడిదారీ వర్గానికి ఉపయోగపడే విధంగా ఉంటుంది తప్పితే ప్రజలకు రైతులకు ఉపయోగపడే విధంగా ఉండదని తక్షణమే ఇలాంటివి అర్థం చేసుకొని కొత్తగూడెం కార్పొరేషన్ ని రద్దుచేసి పాత పద్ధతిలోనే కొనసాగించాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీగా కోరుతున్నాం.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్కే ఉమర్,కారం వెంకప్ప,మహేష్, ఆదినారాయణ, నాగేశ్వర్ రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణలో విద్యార్థుల బస్ పాస్ ఛార్జీలు పెంచడం తగదు

**: రేపాక పవన్ కుమార్**



యాదగిరిగుట్ట, ప్రజా స్ఫూర్తి : తెలంగాణలో విద్యార్థుల బస్ పాస్ ఛార్జీలు పెంచడం తగదు అని రేపాక పవన్ కుమార్ ఒక ప్రకటనలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రమైన అరోపణలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన అభయహస్తం మేనిఫెస్టో బొగస్ అని. ప్రస్తుతం 1150 ఉన్న స్టూడెంట్స్ పాస్ ఆర్డినరీ బస్సు రేట్లు 1400కు పెంచడం 1300 ఉన్న మెట్రో ఎక్స్ప్రెస్ పాసులను 1600లకు పెంచడం, 1450 ఉన్న మెట్రో డీలక్స్ పాసు 1800 పెంచడం విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందు పేద విద్యార్థుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం శాపంగా మారింది అన్నారు.

## రామవరం లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం లో భాగంగా శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల రామవరంలో బాలసభను వియయవంతంగా నిర్వహించారు. విద్యార్థులలో దాగి ఉన్న అంతర్గత సామర్థ్యలను వెలికితీసి వారి ఆసక్తిని గమనించి వివిధ కమిటీలలో భాగస్వాములను చేయడం జరిగింది.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు



హైదరాబాద్ , (ప్రజాస్ఫూర్తి) : మాదిగ సామాజికవర్గానికి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించిన నేపథ్యంలో జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఆ సామాజికవర్గం ఎమ్మెల్యేలతో కలిసి కృతజ్ఞతలు తెలిపారు., ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను ఎంఈఓ డాక్టర్ ప్రభుదయాల్ సందర్శన




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలలు 2 ఇన్ క్లెయిన్, నేతాజీ,కూలీ లైన్, మేదర బస్తీలను సందర్శించిన యంఇఓ. నూతన విద్య సంవత్సరం ప్రారంభమైన దృష్ట్యా శుక్రవారం పలు ప్రభుత్వ పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ప్రభుదయాల్ సందర్శించి అడ్మిషన్ ప్రక్రియ, అక్షరాభ్యాస ప్రక్రియ, బడిబాట కార్యక్రమాలను గురించి వాకబ్ చేశారు. బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్దేశించిన రైతుల్లో కొనసాగించాలని,పాఠశాలలో నమోదు పెంచాలని సూచించారు. అకాడమిక్ పరంగా ప్రధానోపాధ్యాయులకు తగు సూచనలు ఇచ్చి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని విశ్లేషించారు.

## రాజపేటలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయాలి

**: సట్టు తిరుమలేష్**



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండలంలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయాలని టిఆర్ఎస్ రాజపేట మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం రాజపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు. ప్రభుత్వం ఆలంభిస్తున్న విధానాలతో రాజపేట ప్రైవేట్ కళాశాలతో పాటు ఇతర మండలాలలోని ప్రైవేట్ కళాశాలలు ఫీజు రియంబర్స్మెంట్ ఇతర కారణాలతో మూతపడ్డాయని విమర్శించారు. మారుమూల మండలంలో ప్రైవేట్ కళాశాల ద్వారా ఇంటర్ డిగ్రీ విద్య కొనసాగించిన పిల్లలకు ప్రస్తుత కాలేజీ మూతపడడంతో పదవ తరగతి వరకే విద్య ఆగిపోయే ప్రమాదం ఉందని వెంటనే రాజపేటలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. మండల విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం మార్గం ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రితో సన్నిహిత సంబంధాలు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వెంటనే కళాశాల ఏర్పాటు చేసి ఈ విద్యా సంవత్సరం నుండి కొనసాగించాలని అందుకోసం అన్ని పార్టీలు కూడా సహకరించనున్నట్లు చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాలలోని ఉన్నత పాఠశాలల నుండి మొత్తం దాదాపు 400 మందికి పైగా విద్యార్థులు ఎస్ఎస్సి లో ఉత్తీర్ణత పొంది ఇంటర్ చదువులకు ఇతర ప్రాంతాలకు వెళ్లారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు ఎర్రగోకుల జశ్వంత్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి

*** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కొలను హన్మంత్ రెడ్డి**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కొలను హన్మంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా తీసుకొన్న మనబడి కార్యక్రమాన్ని ఆదేశాల మేరకు శుక్రవారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గురుమూర్తి నగర్ పాఠశాలలో రంగారెడ్డినగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బి.శివ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం కొలను హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను స్టూడెంట్స్ కూర్చోడానికి కార్పేట్ స్థాయి బెంచులు, ప్రైవేట్ పాఠశాల ఏ మాత్రం తక్కువ కాకుండా అన్ని మౌలిక సదుపాయాలు ఈ యొక్క కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు అందుబాటులోకి చేరడం జరుగుతుందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ చంద్రయ్య, నాగ వాణి ,రాఘవేంద్ర రెడ్డి పాఠశాల లో చదువుతున విద్యార్థులుకు త్రాగు నీటి గురించి మినరల్ వాటర్ ప్లాంట్ , బోర్ వెల్ , స్కూల్ షెడ్ గురించి , పొద్దునే స్కూల్ ప్రేయర్ గురించి మైక్ సెట్ ఈ మౌలిక సదుపాయాలు గురించి కోలన్ హనుమంత్ రెడ్డి కి కరస్పాండెంట్ కీ వినతి పత్రం అందజేశారు. తక్షణమే స్పందించి వల కోరిక మేరకు సంబంధించిన అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత తొందరలో తక్షణమే అమలు చేయాలి అని ఆదేశించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆయన చేతుల మీదుగా చిన్నపిల్లలకు అక్షర అభ్యాసం చేయించి పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయరాం , డివిజన్ అధ్యక్షులు గణేష్, లాయక్ , సోషల్ మీడియా కోఆర్డినేటర్ తైలం శ్రీనివాస్, మైనార్టీ అధ్యక్షులు డివిజన్ ఉస్మాన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు భాస్కర్ రెడ్డి, ఎల్లయ్య, నయీమ్, గురుమూర్తి నగర్ సొసైటీ నుండి రాణి, హర్షద్, ఓంకార్ రెడ్డి, శ్రీనివాస్ ముదిరాజ్, భాస్కర్ చారి, వెంకటేష్, శ్యామ్ సుందర్, సల్మాన్, డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మాధవి రాణి, జానకి, భాగ్య, లక్ష్మి రెడ్డి, ఆరిఫ్, అప్సర్ పాల్గొన్నారు.

## విమాన ప్రమాదం దురదృష్టకరం...

*** కమల రాణి కొచ్చెర్ల, బిజినెస్ అసోసియేట్, టాటా ఇన్సూరెన్స్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్తున్న విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఊహించని ప్రమాదానికి గురికావడం దురదృష్టకరమని టాటా లైఫ్ ఇన్సూరెన్స్ బిజినెస్ అసోసియేట్ కొచ్చర్ల కమలారాణి అన్నారు. శుక్రవారం కొత్తగూడెం ఎంసీహెచ్ లో జరిగిన కార్యక్రమంలో ప్రమాద మృతులకు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విమాన ప్రమాదంలో 241 మంది ప్రయాణీకులు, ఇద్దరు పైలెట్లు, 10 మంది సిబ్బంది, 24 మంది మెడికల్ స్టూడెంట్స్ చనిపోవడం దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. దేశ చరిత్రలోనే అతి పెద్ద ప్రమాదాల్లో ఇది ఒకటి కావడం బాధాకరమన్నారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు వారు లేని లోటు తీర్చలేనిదన్నారు. చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ విషాదాన్ని భరించే శక్తి బాధిత కుటుంబాలకు లభించాలని ఆకాంక్షించారు. కాగా మృతుల కుటుంబాలకు ప్రతి ఒక్కరికి కోటి రూపాయల చొప్పున 241 మందికి 241 కోట్ల రూపాయలు టాటా గ్రూప్స్ నుండి ఇవ్వడం అభినందించదగ్గ విషయమన్నారు. తద్వారా వారు ఆర్థికంగా పడే ఇబ్బందుల నుండి ఉపశమనం కలుగుతుందన్నారు. ప్రస్తుత రోజుల్లో ప్రమాదం ఎటువైపు నుంచి ముంచుకోస్తుందో తెలీదు కాబట్టి, ప్రతి ఒక్కరికి కూడా ఇన్సూరెన్స్ అనేది ముఖ్యం అని అన్నారు.

## గుజరాత్ లో ఎయిరిండియా ప్రమాద ఘటనపై ఎమ్మెల్యే దిగ్భ్రాంతి

కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి: గుజరాత్ లో గురువారం జరిగిన ఘోర విమాన ప్రమాదం తనను ఎంతగానో దిగ్భ్రాంతికి గురిచేసిందని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ తమ సంతాపాన్ని ప్రకటిస్తూ ఒక ప్రకటనలో తెలియజేశారు. అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్తున్న విమానం టేకాఫ్ అయిన కొద్ది సమయానికే అకస్మాత్తుగా జనావాసాలపై కూలిన ఘటనలో విమాన ప్రయాణికులతో పాటు స్థానికులు, మెడికోలు మరణించడం అత్యంత బాధకరమన్నారు. ప్రమాదంలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి కూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని అన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని అందించాలన్నారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు.

## గోల్డ్ మెడల్ సాధించిన కృష్ణ కిషోర్ ను అభినందించిన కెఎస్ఆర్



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి): మే 23 నుంచి 26 వరకు జరిగిన నేషనల్ ఛాంపియన్ బాక్సింగ్ పోటీలలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ ఇందిరమ్మ కాలనీ పేస్ 3 కి చెందిన దస్తగిరి ,కవితల కుమారుడు కృష్ణ కిషోర్ పాల్గొని గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా మే 28న బాబు జగ్జీవన్ రాయి భవన్ లో జరిగిన కార్యక్రమంలో సీఎం పురస్కారాన్ని అందుకున్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. దీనికి కె ఎస్ ఆర్ సానుకూలంగా స్పందించి మీకు ఎలాంటి పరిస్థితిలో అయినా నేను మీకు తోడుగా ఉంటానని, భవిష్యత్లో కష్టపడి మంచి స్థాయికి రావాలని కోరారు. అనంతరం వారికి తగు ఆర్థిక సహాయం చేశారు.

## అభివృద్ధి పనులలో నాణ్యత లోపిస్తే సహించేది లేదు

*** ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : అభివృద్ధి పనులలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని మహంకాళి నగర్ నాగమ్మ నగర్ లో నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, కాసాని శంకర్, దాతి రమేష్, వెంకట్రావు, కటికరవి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ నారాయణతో మందకృష్ణ మాదిగ భేటీ



తెలంగాణ బ్యూరో : సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ శుక్రవారం తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసారు. సుమారు గంటసేపు ఎస్సీ వర్గీకరణ, చట్టసభల్లో బీసీల రిజర్వేషన్లు, కులగణన మొదలైన అంశాల గురించి ఇరువురు చర్చించారు. ప్రస్తుతం దేశంలో క్లిష్ట పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ఐక్య ఉద్యమాలు నిర్వహించాల్సిన అవశ్యకత ప్రజాస్వామిక వాదులపై ఉన్నదని గుర్తు చేసుకున్నారు. చిన్నచిన్న అంశాలను పక్కన పెట్టి, భిన్నాభిప్రాయాలు గౌరవిస్తూనే విశాల ప్రజా ఆకాంక్షల మేరకు కలిసి పనిచేయాల్సిన అవసరముందని నారాయణ గుర్తు చేశారు. అంతే కాకుండా మందకృష్ణ మాదిగను పద్మశ్రీ అవార్డ్ వరించినందుకు గాను ఈ సందర్భంగా నారాయణ ప్రత్యేకంగా అభినందించారు. పద్మ శ్రీ అవార్డు పట్ల గతంలో భిన్నమైన అభిప్రాయం వుండేదని, కానీ పద్మశ్రీ అవార్ట్ ను మందకృష్ణకు ఇవ్వడం వల్ల ఆ అవార్డుకే గౌరవం వచ్చిందన్నారు. ఇదే విషయాన్ని గతంలో మీడియా ముందు కూడా తాను మాట్లాడినట్లు నారాయణ గుర్తు చేశారు. నమ్మిన ఆశయం, ఎత్తుకున్న ఎజెండా, మూడు దశాబ్దాల పాటు అలుపెరగని పోరాట ఫలితమే ఈ పద్మశ్రీ అవార్డ్ అని నారాయణ కొనియాడారు.

# రాష్ట్రంలో కొత్తగా 571 పాఠశాలలు ప్రారంభిస్తున్నాం

**: సీఎం రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడమే తమ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలని, అందుకు అవసరమైన మౌలిక వసతులు, ఉపాధ్యాయులకు శిక్షణ, ఇతర సదుపాయాల కల్పనకు ఎంత ఖర్చయినా వెనుకాడేది లేదని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో 20 మంది కన్నా ఎక్కువ పిల్లలున్న గ్రామాలు, పట్టణాల్లో ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. బోధనా ప్రమాణాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను సీఎం అధికారులకు సూచించారు. ''విద్యార్థులకు భాషా పరిజ్ఞానంతో పాటు నైపుణ్యాల పెంపునకు వీలుగా విద్యావ్యవస్థను మార్చాలి. హైస్కూల్



స్థాయి నుంచి విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కల్పిస్తే భవిష్యత్తులో వారు తమకు ఇష్టమైన రంగంలో రాణించే అవకాశం ఉంటుంది. రాష్ట్రంలో పట్టణీకరణ వేగంగా సాగుతున్న నేపథ్యంలో విద్యాశాఖ పురపాలక శాఖతో సమన్వయం చేసుకోవాలి. హెచ్‌ఎండీఏ, మున్సిపల్ లేఅవుట్లలో ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విభాగాల కింద ఇంటర్మీడియట్ వరకు ఉన్న విద్యా సంస్థలను హేతుబద్ధీకరించి ప్రతి పాఠశాలలో నిర్దిష్ట సంఖ్యలో విద్యార్థులు ఉండేలా చూడాలి. నాణ్యమైన భోజనం, యూనిఫాం, పాఠ్య పుస్తకాలు ఇస్తున్నందున విద్యార్థులు పెద్ద సంఖ్యలో గురుకులాల వైపు మొగ్గు చూపుతున్నారు. డే స్కాలర్లకు కూడా అవన్నీ అందించే విషయంపై అధ్యయనం చేయాలి''అని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, కే.కేశవరావు, సీఎంవో, విద్యా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## సీఎం రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

హైదరాబాద్: గచ్చిబౌలి పీఎస్‌లో నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. తొమ్మిదేళ్ల క్రితం గోపన్‌పల్లిలోని వివాదాస్పద భూమిలో ఉన్న సొసైటీ గదిని జేసీబీతో కూల్చివేశారని, కులం పేరుతో దూషించారని రేవంత్‌రెడ్డితో పాటు ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, లక్ష్మణ్‌పై పెద్ది రాజు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పట్లో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని రేవంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై పెద్దిరాజుకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు.. తదుపరి విచారణను ఈనెల 20కి వాయిదా వేసింది.

## కేటీఆర్‌కు మరోసారి ఏసీబీ నోటీసులు.. స్పందించిన ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్: ఫార్ములా ఈ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు మరోసారి నోటీసులు జారీ చేయడాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఖండించారు. ''రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే మా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చారు. కాంగ్రెస్ సర్కార్ మళ్లీ నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. మీరు ఎన్ని కుట్రలు పన్నినా మీ వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగడతాం'' అని పేర్కొన్నారు.ఫార్ములా ఈ కేసులో ఈనెల 16న విచారణకు రావాలని అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) మరోసారి కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది. మే 26నే ఈ కేసులో విచారణకు హాజరు కావాలని గతంలో ఏసీబీ నోటీసులు ఇచ్చింది. విదేశీ పర్యటన షెడ్యూల్ ఉందని.. తిరిగి వచ్చాక హాజరవుతానని కేటీఆర్ సమాధానం ఇచ్చారు. దీంతో తాజాగా ఇప్పుడు విచారణకు హాజరు కావాలని కేటీఆర్‌కు ఏసీబీ మరోసారి నోటీసులు ఇచ్చింది.



## మాజీ మంత్రి కేటీఆర్‌కు మరోసారి ఏసీబీ నోటీసులు

హైదరాబాద్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈనెల 16న ఉదయం 10 గంటలకు విచారణకు రావాలని నోటీసులులో పేర్కొంది. ఫార్ములా ఈరేసు కేసులో విచారణకు హాజరుకావాలని తెలిపింది. మే 26నే ఈ కేసులో విచారణకు హాజరు కావాలని ఏసీబీ నోటీసులు ఇచ్చింది. విదేశీ పర్యటన షెడ్యూల్ ఉందని.. తిరిగి వచ్చాక హాజరవుతానని కేటీఆర్ సమాధానం ఇచ్చారు. తాజాగా ఇప్పుడు విచారణకు హాజరు కావాలని కేటీఆర్‌కు ఏసీబీ మరోసారి నోటీసులు ఇచ్చింది.



*** లై డిటెక్టర్ పరీక్షలకు నేను సిద్ధం.. సీఎం సిద్ధమా?**

ఏసీబీ నోటీసులపై కేటీఆర్ స్పందించారు. ఫార్ములాఈ కేసులో ఈనెల 16న ఏసీబీ విచారణకు సహకరిస్తానని తెలిపారు. ''బాధ్యత గల పౌరుడిగా విచారణకు హాజరవుతా. పాలన చేతకాక ప్రజల దృష్టి మళ్లించే యత్నం ఇది. ఓటుకు నోటు కేసులో సీఎంను కూడా ఏసీబీ విచారిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసురుతున్నా. ఇద్దరం ఏసీబీ విచారణ ఎదుర్కొంటున్నాం. లై డిటెక్టర్ పరీక్షలకు నేను సిద్ధం.. మీరు సిద్ధమా? జడ్జి సమక్షంలో ఇద్దరం లై డిటెక్టర్ పరీక్షలు చేయించుకుందాం. టీవీల్లో లైవ్‌గా చూపిద్దాం. లైడిటెక్టర్ పరీక్షలు చూసి ఎవరు నేరస్థులో ప్రజలే నిర్ణయిస్తారు. నాతో పాటు లై డిటెక్టర్ పరీక్షలు చేయించుకునే ధైర్యం ఉందా? పదే పదే విచారణలతో ప్రజాధనం వృథా ఎందుకు?'' అని కేటీఆర్ ప్రశ్నించారు.

## గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో కేసీఆర్‌కు వైద్య పరీక్షలు

హైదరాబాద్: భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరీక్షల నిమిత్తం శుక్రవారం ఆయన ఏఐజీ ఆసుపత్రికి వెళ్లారు. సాధారణ గ్యాస్ట్రిక్ పరీక్షలు చేశామని వైద్యులు తెలిపారు. డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు.



## అక్రెడిటేషన్ పాలసీని సరళీకృతం చేయాలి

**: WJI జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ**



హైదరాబాద్: తెలంగాణలో జర్నలిస్టులకు అక్రెడిటేషన్లు ఇచ్చే విధివిధానాలను వెంటనే ప్రకటించి, అర్హులైన వారందరికీ వీలైనంత త్వరగా కార్డులు ఇవ్వాలని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (WJI) జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ డిమాండ్ చేశారు. అక్రెడిటేషన్ పాలసీని సరళీకృతం చేయాలని సూచించారు. ఏడాది నుంచి ఈ అంశాన్ని తేల్చకపోవడం సమంజసం కాదన్నారు. తెలంగాణ పర్యటనలో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పటిష్ఠమైన ఇన్సూరెన్స్, ఆసుపత్రులలో ఉచిత చికిత్స, ఆరోగ్య కార్డులు తదితర అంశాలతో పాటు తెలంగాణ పాత్రికేయుల సమస్యలపై ముఖ్యమంత్రిని కలిసి త్వరలో వినతిపత్రం ఇవ్వనున్నట్లు సంజయ్ పేర్కొన్నారు. రైళ్లు, విమానాల టికెట్లలో జర్నలిస్టులకు రాయితీ ఇవ్వాలని, టోల్ ఛార్జీలను పూర్తిగా రద్దు చేయాలని తాము పోరాడుతున్నట్లు తెలిపారు. సెప్టెంబరులో ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించి, ఈ అంశాలను ప్రధాని నరేంద్ర మోదీకి విన్నవిస్తామని చెప్పారు. జర్నలిజం ప్రింట్ మీడియా నుంచి మొదలై వివిధ రూపాలకు విస్తరించినందున పాత చట్టాలను సవరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ ప్రక్రియలో పాత్రికేయులకూ భాగస్వామ్యం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, గెజిటెడ్ అధికారులకు కల్పించే సౌకర్యాలను జర్నలిస్టులకు వర్తింపజేయాలన్నారు. ప్రస్తుతం దేశంలోని 16 రాష్ట్రాల్లో తమ పాత్రికేయుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని, దేశంలోని అన్ని రాష్ట్రాలలో తమ సభ్యులు ఉన్నారని సంజయ్ ఉపాధ్యాయ తెలిపారు. జాతీయ స్థాయిలో బీఎంఎస్‌కు అనుబంధంగా పనిచేస్తున్నామని, త్వరలో నేపాల్‌కు కూడా విస్తరించబోతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూజేఐ రాష్ట్ర అధ్యక్షుడు రాణా ప్రతాప్, ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు అనిల్ దేశాయ్, సిద్ధిరెడ్డి శ్రీనివాసరెడ్డి , కార్యదర్శి క్రాంతి, హైదరాబాద్ సిటీ అధ్యక్షుడు బాలకృష్ణ పాల్గొన్నారు. జాతీయ విద్యా విధానం 2020, మీడియా పాత్ర అనే అంశంపై డబ్ల్యూజేఐ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఉస్మానియా యూనివర్సిటీలో జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్లు డబ్ల్యూజేఐ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నందనం కృపాకర్ తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ఉత్తమ జర్నలిస్టులకు పురస్కార ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## హైదరాబాద్‌లో పార్థి గ్యాంగ్.. నలుగురిని అరెస్ట్‌చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు

హైదరాబాద్: పార్థి గ్యాంగ్‌కు చెందిన గంధపు చెక్కల దొంగలను జూబ్లీ హిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. యూసఫ్‌గూడలోని NIMSME క్యాంపస్‌లో గంధపు చెక్కలు చేయడంతో పలాన్‌బాయి, షహ్నాజ్‌బాయి, నిమత్‌బాయి, మాధురి ఆదివాసీ... అనే నలుగురు మహిళల్ని అరెస్టు చేశారు. 20 రోజుల క్రితం 23 మంది పార్థి గ్యాంగ్ సభ్యులు నగరానికి వచ్చారని పోలీసులు తెలిపారు. వీరంతా మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్రకు చెందిన వారని వెల్లడించారు. ముఠా సభ్యులు జూబ్లీహిల్స్, మధురానగర్ పీఎస్‌ల పరిధిలో



గంధపు చెక్కల చోరీకి పాల్పడుతున్నారని, వాటిని పరిచయస్థులైన స్థానిక స్మగ్లర్లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని వివరించారు. ఎవరికీ అనుమానం రాకుండా పిల్లలు, మహిళల్ని ముందు పెట్టి ఈ చోరీలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మిగిలిన ముఠా సభ్యుల కోసం గాలిస్తున్నామని, త్వరలోనే వారిని పట్టుకుంటామని పోలీసులు వెల్లడించారు.

## తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు భారీ శుభవార్త..

**- డీఏ పెంపు**

ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వంభారీ శుభవార్త చెప్పింది. ఉద్యోగుల డీఏ 3.64 శాతానికి పెంచుతూ జీవో జారీ చేసింది. 2023 జనవరి 1వ తేదీ నుంచి పెంచిన డీఏ వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా, ఇటీవల రెండు డీఏలు ఇవ్వాలని రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఇవాళ ఒక డీఏ ఇచ్చిన ప్రభుత్వం, మరో ఆరు నెలల తర్వాత మరో డీఏ అందించనుంది. కాగా, ఉద్యోగులకు ప్రకటించిన ఒక డీఏ చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతి నెలా సగటున సుమారు రూ.200 కోట్లు.. ఏడాదికి దాదాపు రూ.2,400 కోట్ల అదనపు భారం ఖజానాపై పడనుందని ఆర్థికశాఖ వర్గాలు లెక్కలు తీశాయి. ఓ వైపు పెద్ద ఎత్తున అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలకు నిధుల కొరత రాకుండా చూస్తూనే మరోవైపు ఎంప్లాయీస్ సంక్షేమానికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. అందులో భాగంగా ఇప్పటినుంచి ప్రతినెలా రూ.700 కోట్లను రిటైర్డ్ ఎంప్లాయీస్ బెనిఫిట్స్ కోసం ఖర్చు చేయాలని నిర్ణయం తీసుకున్నది. మొత్తం ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో ఇకటి ఇవ్వడానికి సిద్ధమవగా.. మరో నాలుగు పెండింగ్‌లో ఉండనున్నాయి.

## శ్రీవారి లడ్డూ ప్రసాదంపై అసత్య ఆరోపణలు చేస్తే కఠిన చర్యలు: తితిదే

తిరుమల: తిరుమల లడ్డూ ప్రసాదంపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) స్పందించింది. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాకు చెందిన నవీన్ కుమార్ చేస్తోన్న ఆరోపణలను ఖండించింది. అవన్నీ అవాస్తవమని పేర్కొంది.''జూన్ 8న స్వామివారి లడ్డూ ప్రసాదం తినేటప్పుడు నోటిలో గాయమైందని సదరు వ్యక్తి ఆరోపణలు చేశారు. వెంటనే స్పందించిన తితిదే సిబ్బంది అతడిని అంబులెన్స్‌లో తిరుమలలోని అశ్విని ఆసుపత్రిలో చేర్చి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం స్విమ్స్‌లో కూడా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ వ్యక్తి ప్రసాదం తింటూ.. తన నాలుకను తానే కొరుక్కోవడంతో నాలుకకు చిన్న గాయమైందని వైద్య పరీక్షల్లో తేలింది. అయినా, తితిదే నుంచి నష్టపరిహారం పొందాలనే దురుద్దేశంతో సదరు వ్యక్తి లడ్డూ ప్రసాదంపై సోషల్‌మీడియాలో అసత్య ఆరోపణలు చేస్తున్నట్టు గుర్తించాం. అతడి ఆరోపణలు తితిదే తీవ్రంగా ఖండిస్తున్నాం.

# ‘టాటా చరిత్రలో చీకటి రోజు’ - ఉద్యోగులకు లేఖలో సంస్థ ఛైర్మన్

అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం ఘోర ప్రమాదానికి గురైన విషయంపై టాటా గ్రూప్ మరోసారి స్పందించింది. తమకు ఇది కష్టమైన సమయమే అయినప్పటికీ.. బాధ్యతల విషయంలో వెనక్కి తగ్గబోమని ఉద్యోగులకు రాసిన లేఖలో సంస్థ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ పేర్కొన్నారు. సంస్థ చరిత్రలో ఇదో చీకటి రోజుగా పేర్కొన్న ఆయన.. విమాన ప్రమాదం దర్యాప్తు అంశంలో పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఎయిరిండియా ప్రయాణికుల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు.

**అండగా ఉంటాం..**

“ఇది చాలా కఠిన సమయం. నిన్న జరిగిన ఘటన వర్ణించలేనిది. మేమందరం ఇంకా షాక్‌లోనే ఉన్నాం. మనకు తెలిసిన ఓ వ్యక్తిని కోల్పోతేనే ఎంతో బాధపడతాం. కానీ, ఒకేసారి ఇంతమంది చనిపోవడం నిజంగా జీర్ణించుకోలేనిది. టాటా గ్రూపు చరిత్రలో ఇదో చీకటి రోజు. ఈ మాటలు ప్రస్తుతం ఓదార్పును ఇవ్వలేవు. ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబీకులకు, గాయాలతో బాధపడుతున్న వారికి అండగా నిలుస్తాం. అక్కడ ఏం జరిగిందో అనే విషయాన్ని మీలాగే మేమూ తెలుసుకోవాలని అనుకుంటున్నాం. ప్రస్తుతానికి సమాచారం లేకున్నా.. తప్పకుండా అన్ని



విషయాలు తెలుస్తాయి” అని టాటా గ్రూపు ఛైర్మన్ పేర్కొన్నారు.

**దర్యాప్తు విషయాలపై పారదర్శకత**

ప్రమాద ఘటనపై దర్యాప్తు జరిపేందుకు బ్రిటన్, అమెరికా నుంచి దర్యాప్తు బృందాలు అహ్మదాబాద్‌కు చేరుకున్నాయని, వారికి తమ నుంచి పూర్తి సహకారం ఉంటుందని చంద్రశేఖరన్ పేర్కొన్నారు. సమాజం పట్ల బాధ్యత విషయంలో టాటా గ్రూపు నిక్కచ్చిగా ఉంటుందని, దర్యాప్తులో వెల్లడయ్యే విషయాలపైనా పూర్తి పారదర్శకంగా ఉంటామని స్పష్టం చేశారు. ప్రమాదానికి సంబంధించిన విషయాలను తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తున్నారని, ఈ క్రమంలో ఎన్నో ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. అయితే, అందులో కొన్ని సరైనవి, కొన్ని తప్పు కావచ్చని.. ఏదేమైనా కొంత సహనంతో ఉండాలని విజ్ఞప్తి చేశారు.

**నష్టాన్ని భరిస్తాం..**

ఈ ఘోర ప్రమాదంపై దర్యాప్తులో వాస్తవాలు తెలుస్తాయని, వాటిని తెలియజేయడంలో పూర్తి పారదర్శకత ప్రదర్శిస్తామని టాటా గ్రూపు ఛైర్మన్ హామీ ఇచ్చారు. విశ్వాసం, సంరక్షణ అనే ప్రాతిపదికతోనే ఈ గ్రూపు నిర్మితమైందన్న ఆయన.. కష్టకాలమైనప్పటికీ బాధ్యతల నుంచి, ఏది సరైందో అది చేయడంలో వెనక్కి తగ్గబోమన్నారు. ఈ నష్టాన్ని తాము కూడా భరిస్తామని, వీటిని ఎన్నటికీ మరచిపోమంటూ ఉద్యోగులకు రాసిన లేఖలో చంద్రశేఖరన్ వెల్లడించారు.

## ప్రధాని మోదీకి.. బెంజమిన్ నెతన్యాహు ఫోన్ కాల్



దిల్లీ: పశ్చిమాసియా దేశాలైన ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఇరాన్‌లోని అనుమానాస్పద అణు కేంద్రాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులకు దిగింది. ప్రతిచర్యగా ఇరాన్ డ్రోన్లను ప్రయోగించింది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రధాని మోదీకి ఫోన్ చేశారు. ప్రస్తుత పరిణామాలను ఆయనకు వివరించారు. ఉద్రిక్త పరిస్థితులపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోందని మోదీ అన్నారు. వీలైనంత త్వరగా శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించాల్సిన అవసరముందని చెప్పారు. ఈ మేరకు తాను నెతన్యాహుతో మాట్లాడినట్లు మోదీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఇరాన్‌పై దాడికి దిగిన ఇజ్రాయెల్..దౌత్యపరంగానూ మద్దతు కూడగడుతోంది. వివిధ దేశాధినేతలతో నెతన్యాహు నేరుగా ఫోన్‌లో మాట్లాడుతున్నారు. దాడికి దిగేందుకు దారితీసిన పరిస్థితులను వివరిస్తున్నారు. జర్మన్ ఛాన్సలర్ ఫ్రైడ్‌రిచ్ మెర్జ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌కు కూడా ఆయన ఫోన్ చేసి మాట్లాడారు. మరోవైపు ఇరాన్ మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇజ్రాయెల్ దాడుల్లో 78 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.



## విజయ్ రూపాణీ కుటుంబసభ్యులను పరామర్శించిన ప్రధాని మోదీ

అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా విమానం గురువారం ఘోర ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ శుక్రవారం ఘటనాస్థలానికి వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన భాజపా నేత, గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపాణీ కుటుంబసభ్యులను ప్రధాని పరామర్శించారు. ఆయన మృతిపట్ల సంతాపం తెలిపారు. గురువారం జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాద సమయంలో అందులో మొత్తం 242 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారు. వీరిలో 241 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒకే ఒక్క ప్రయాణికుడు మృత్యుంజయుడిగా బయటపడ్డారు. గుజరాత్ మాజీ సీఎం, భాజపా సీనియర్ నేత విజయ్ రూపాణీ కూడా ఈ ప్రమాదంలో మృతి చెందారు. లండన్‌లో ఉంటున్న తన కుమార్తెను చూసేందుకు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆయన 2016 నుంచి 2021 వరకు రెండు సార్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కాగా.. చిన్న కుమారుడు పూజిత్ ఓ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు.

## అండర్ గ్రౌండ్‌లో ఇరాన్ సైనికాధికారుల సమావేశం.. ఇజ్రాయెల్ దాడి..!



ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ ఎయిర్ ఫోర్స్ అగ్ర నాయకత్వం చాలా వరకు తుడిచి పెట్టుకుపోయినట్లు సమాచారం. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ వెల్లడించారు. ఐఆర్‌జీసీ ఎయిర్ కమాండ్‌లోని అధికారులు భూగర్భ బంకర్‌లో ఓ సమావేశం నిర్వహిస్తుండగా.. ఇజ్రాయెల్ దాడి చేసింది. దీంతో ఆ సంస్థ నాయకులు మరణించినట్లు కట్జ్ పేర్కొన్నారు. ఈ దాడిలో ఇరాన్‌కు జరిగిన నష్టంపై తమ సైన్యం అంచనా వేస్తోందన్నారు. ఇప్పటి వరకు వెలువడిన వివరాల ప్రకారం ఐఆర్‌జీసీ చీఫ్ సలామీ, ఆర్మీ చీఫ్ మహమ్మద్ బాఘేరీ, ఖాతమ్ అల్ అన్‌బియా హెడ్‌క్వార్టర్స్ చీఫ్ అలి రషీద్, ఇరాన్ సుప్రీం లీడర్ సలహాదారు అలీ షంఖాని ఇజ్రాయెల్ దాడిలో చనిపోయారు.

## విమాన ప్రమాదం.. ఎయిరిండియాకు డీజీసీఏ కీలక ఆదేశాలు

అహ్మదాబాద్ విమాన ప్రమాదం నేపథ్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కీలక ఆదేశాలు జారీ చేసింది. అన్ని బోయింగ్ 787 విమానాల్లో భద్రతా తనిఖీలు చేపట్టాలని ఎయిరిండియాను ఆదేశించింది. ఈ మేరకు తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలని పేర్కొంది. “అహ్మదాబాద్‌గాట్విక్ ఎయిరిండియా విమానం ప్రమాదానికి గురైన దృష్ట్యా.. బోయింగ్ 7878/9కు చెందిన విమానాల్లో మెరుగైన భద్రతా తనిఖీలు చేయాలి. సంబంధిత ప్రాంతీయ డీజీసీఏ కార్యాలయాల సహకారంతో తక్షణమే




వీటిని చేపట్టాలి” అని ఎయిరిండియాను డీజీసీఏ ఆదేశించింది. విమానాలు బయలుదేరే ముందు ఇంధనం పర్యవేక్షణ, క్యాబిన్ ఎయిర్ కంప్రెసర్, ఎలక్ట్రానిక్ ఇంజిన్ నియంత్రణ వ్యవస్థ, హైడ్రాలిక్ వ్యవస్థ, టేకాఫ్ ప్రమాణాల పున:పరిశీలన వంటి తనిఖీలు తప్పనిసరిగా చేపట్టాలని స్పష్టం చేసింది. వీటితోపాటు ఫ్లైట్ కంట్రోల్ ఇన్‌స్పెక్షన్‌ను ప్రవేశపెడుతున్నామని, ఇంజిన్ సామర్థ్యాలకు సంబంధించిన తనిఖీలను రెండు వారాల్లో పూర్తిచేయాలని ఎయిరిండియాకు సూచించింది. బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానాల్లో గత పదిహేను రోజుల్లో తరచుగా సంభవించిన సమస్యలను వీలైనంత త్వరగా సమీక్షించుకోవాలని సూచించింది. సమీక్ష తర్వాత నిర్వహణ చర్యలను ముగించాలని తాజా ఆదేశాల్లో పేర్కొంది. సంబంధిత తనిఖీల నివేదికను డీజీసీఏకు అందజేయాలని సూచించింది.

## బ్లాక్‌బాక్స్ లభ్యం.. కీలక సమాచారంపై ఉత్కంఠ!

అహ్మదాబాద్‌లో ఘోర ప్రమాదానికి గురైన ఎయిరిండియా విమానానికి సంబంధించి అత్యంత కీలకమైన బ్లాక్ బాక్స్ లభ్యమైంది. భవన శిథిలాల నుంచి దీన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో వెల్లడించింది. ప్రమాద ఘటనపై ముమ్మర దర్యాప్తు జరుగుతోందని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన 40 మంది సిబ్బంది పౌరవిమానయాన శాఖ బృందాలతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపింది. అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా విమానం గురువారం ఘోర ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో మొత్తం 265 మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే, ఈ ప్రమాదానికి గల కారణాలు ఇప్పటివరకు తెలియలేదు. విమానంలో కీలకంగా ఉండే బ్లాక్ బాక్స్‌లోని సమాచారాన్ని విశ్లేషిస్తే





ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను తెలుసుకునే వీలు కలుగుతుంది.

**ఏమిటీ బ్లాక్ బాక్స్..?**

ప్రతి కమర్షియల్ విమానంలో రెండు బాక్స్‌లు ఉంటాయి. అందులో ఒకటి ఫ్లైట్ డేటాను రికార్డ్ చేయగా.. మరొకటి కాక్‌పిట్ వాయిస్ రికార్డుకు ఉపయోగపడుతుంది. విమానాలకు ఏదైనా ముప్పు వాటిల్లినప్పుడు, అత్యవసర పరిస్థితిని తెలియజేస్తూ ‘మేడే’ అంటూ సమీపంలోని ఏటీసీకి పైలట్ ఓ సందేశాన్ని పంపుతారు. వీటితోపాటు పైలట్‌కోపైలట్‌ల సంభాషణలన్నీ డిజిటల్ ఫ్లైట్ డేటా రికార్డర్ (డీఎఫ్‌డీఆర్)లో రికార్డవుతాయి. ఈ డీఎఫ్‌డీఆర్‌నే బ్లాక్‌బాక్స్‌గా వ్యవహరిస్తారని ఏఏఐబీ తెలిపింది.

## నాడు గుజరాత్ సీఎం విమానాన్ని కూల్చి..!

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపాణీ ప్రాణాలు కోల్పోయారు. లండన్‌లో ఉన్న తన కుమార్తెను చూసేందుకు వెళ్తుండగా ఆయన మృతిచెందారు. కాగా.. గతంలో పలువురు రాజకీయ ప్రముఖులు ఇలా విమాన ప్రమాదాల్లో మృతిచెందిన సందర్భాలున్నాయి. అయితే, 60 ఏళ్ల క్రితం ఇదే గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్న విమానాన్ని దాయాది పాకిస్థాన్ కూల్చివేయడం గమనార్హం. భారత్‌పాకిస్థాన్ యుద్ధ సమయంలో ఆ ఘటన చోటుచేసుకుంది.

*** యుద్ధ మేఘాల్లోకి అనుకోకుండా వెళ్లి..**

1965 ఆగస్టులో భారత్‌పాకిస్థాన్ మధ్య మొదలైన యుద్ధం.. సెప్టెంబరు నాటికి తీవ్రమైంది. దీంతో బేషరతుగా కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవాలని ఐరాస భద్రతా మండలి తీర్మానం చేసింది. దీనికి భారత్ తక్షణమే అంగీకరించింది. పాక్ మాత్రం నాన్చుకుంటూ అంగీకారం



తెలిపింది. అయినప్పటికీ సరిహద్దుల్లో ఉద్రిక్త వాతావరణం కొనసాగింది. అదే సమయంలో సెప్టెంబరు 19న అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి బల్వంత్‌రాయ్ మెహతా ఆయన భార్య సరోజ్‌బెన్, ముగ్గురు సహాయకులు, ఇద్దరు జర్నలిస్టులతో కలిసి చాపర్‌లో మిథాపుర్ బయల్దేరారు. దీన్ని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ పైలట్ జహంగీర్ ఇంజినీర్ నడిపారు. అయితే పొరపాటుగా వీరు ప్రయాణిస్తున్న చాపర్ భారత్‌పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు జరుగుతున్న ప్రాంతంలోకి వెళ్లింది.

*** సిగ్నల్ పంపినా.. పట్టించుకోని పాక్**

దీన్ని గమనించిన పాకిస్థాన్ ఎయిర్‌ఫోర్స్ ఫ్లయింగ్ ఆఫీసర్ ఖాయిస్ హుస్సేన్.. బల్వంత్‌రాయ్ చాపర్‌ను నిఘా జెట్‌గా అనుమానించారు. వెంటనే తన యుద్ధవిమానంతో దూసుకొచ్చారు. బల్వంత్‌రాయ్ చాపర్ నుంచి సిగ్నల్ వెళ్లినా.. శత్రుసైన్యం కాల్పులు జరిపింది. కొన్ని క్షణాల్లో చాపర్ కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో బల్వంత్‌రాయ్ సహా అందులో ఉన్న 8 మంది దుర్మరణం చెందారు. అంతర్జాతీయ స్థాయి సైనిక ఘర్షణల్లో ఓ రాజకీయ నాయకుడు ప్రాణాలు కోల్పోవడం భారత చరిత్రలో అదే తొలిసారి కావడం గమనార్హం. అయితే, ఘటన సమయంలో ఆ విమానంలో ఉన్నది ముఖ్యమంత్రి అన్న విషయం ఖాయిస్ హుస్సేన్‌కు తెలియదట. ఆ తర్వాత మీడియాలో వచ్చిన వార్తలు చూసే చనిపోయింది సీఎం అని తెలుసుకున్నట్లు గతంలో ఆయన ఓసారి వెల్లడించారు. ఈ ఘటన జరిగిన 46 ఏళ్ల తర్వాత బల్వంత్‌రాయ్ చాపర్ నడిపిన పైలట్ జహంగీర్ ఇంజినీర్ కుమార్తెకు ఖాయిస్ హుస్సేన్ క్షమాపణలు చెబుతూ సందేశం పంపారు.

# పెందుర్తిలో నకిలీ పోలీసులు.. ప్రేమ జంటలే వారి టార్గెట్

విశాఖపట్నం: పెందుర్తిలో ప్రేమ జంటల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు నకిలీ పోలీసులు అరెస్టయ్యారు. శివప్రసాద్, కడారపు గోపి ఈనెల 6వ తేదీన పోలీసులమని చెప్పి.. ఓ ప్రేమ జంటను బెదిరించి రూ.2000 గూగుల్ పే ద్వారా తీసుకున్నారు. మరో జంట వద్ద రూ. 20వేలు ఫోన్ పే ద్వారా తమ ఖాతాలో జమ చేసుకున్నారు. నిందితులు పోలీస్





యూనిఫామ్ ధరించి ద్విచక్రవాహనంపై తిరుగుతూ.. మీపై కేసులు పెడతామని ప్రేమ జంటలను బెదిరించి డబ్బులు దోచుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పెందుర్తి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పెందుర్తి పోలీసులు వలపన్ని ఇద్దరినీ పట్టుకున్నారు. అదుపులోకి తీసుకునే సమయంలో నిందితులు పోలీసు యూనిఫామ్‌లో ఉన్నారు. ఇద్దరికీ నేర చరిత్ర ఉందని, వీరిపై 15 కేసులు ఉన్నాయని పెందుర్తి సీఐ సతీష్ కుమార్ తెలిపారు. నకిలీ పోలీసుల చేతిలో మోసపోయిన వారు పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని, బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

## జీఎస్ఐ జాబితాలో బెలూం గుహలు.. హర్షం వ్యక్తం చేసిన మంత్రి దుర్గేష్



అమరావతి: భౌగోళిక వారసత్వ జాబితాలో ప్రఖ్యాత బెలూం గుహలకు గుర్తింపు దక్కడంపై పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నంద్యాల జిల్లా కొలిమిగుండ్లలోని బెలూం గుహలకు జీఎస్ఐ ప్రత్యేక గుర్తింపునివ్వడం సంతోషకరమన్నారు. పురాతన సంస్కృతికి నిలయాలు ఈ బెలూం గుహలని పేర్కొన్నారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకటనతో పర్యాటకంగా ఈ ప్రాంతానికి మరింత ప్రాచుర్యం లభిస్తుందని మంత్రి తెలిపారు. జీఎస్ఐ జాబితాలో చోటు దక్కడం వల్ల బెలూం గుహలు మరింత అభివృద్ధికి నోచుకోనున్నాయన్నారు. ప్రపంచంలో రెండోది, దేశంలోనే పొడవైన అంతర్భాగ గుహలుగా బెలూం గుహలు ప్రసిద్ధి చెందాయని వ్యాఖ్యానించారు. దేశ పర్యాటక ప్రదేశాల్లో రాష్ట్రంలోని బెలూం గుహలకు స్థానం దక్కుతుందని అన్నారు. విదేశీ పర్యాటకులను ఆకట్టుకునేలా మరింత ప్రచారం కల్పిస్తామని తెలిపారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో పర్యాటక రంగం అభివృద్ధి చెందుతోందని మంత్రి దుర్గేష్ అన్నారు.

## శ్రీవారి లడ్డూ ప్రసాదంపై అసత్య ఆరోపణలు చేస్తే కఠిన చర్యలు



తిరుమల: తిరుమల లడ్డూ ప్రసాదంపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) స్పందించింది. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాకు చెందిన నవీన్ కుమార్ చేస్తోన్న ఆరోపణలను ఖండించింది. అవన్నీ అవాస్తవమని పేర్కొంది. ''జూన్ 8న స్వామివారి లడ్డూ ప్రసాదం తినేటప్పుడు నోటిలో గాయమైందని సదురు వ్యక్తి ఆరోపణలు చేశారు. వెంటనే స్పందించిన తితిదే సిబ్బంది అతడిని అంబులెన్స్‌లో తిరుమలలోని అశ్విని ఆసుపత్రిలో చేర్చి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం స్విమ్స్‌లో కూడా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ వ్యక్తి ప్రసాదం తింటూ.. తన నాలుకను తానే కొరుక్కోవడంతో నాలుకకు చిన్న గాయమైందని వైద్య పరీక్షల్లో తేలింది. అయినా, తితిదే నుంచి నష్టపరిహారం పొందాలనే దురుద్దేశంతో సదురు వ్యక్తి లడ్డూ ప్రసాదంపై సోషల్‌మీడియాలో అసత్య ఆరోపణలు చేస్తున్నట్టు గుర్తించాం. అతడి ఆరోపణలు తితిదే తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజలను గందరగోళానికి గురిచేసేలా దురుద్దేశపూరిత చర్యకు పాల్పడిన నవీన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం''అని తితిదే ఓ ప్రకటనలో పేర్కొంది.

## ఏపీ నుంచి కేంద్ర సర్వీసులకు ఇద్దరు ఐఏఎస్ అధికారులు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు ఐఏఎస్ అధికారులు కేంద్ర సర్వీసులకు వెళ్తున్నారు. 2010 బ్యాచ్‌కు చెందిన ఆర్థికశాఖలో అదనపు కార్యదర్శిగా ఉన్న జె.నివాస్.. జనగణన కార్యకలాపాల డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 2011 బ్యాచ్‌కు చెందిన రిజిస్ట్రేషన్, స్టాంపులశాఖ ఐజీగా ఉన్న ఎం.హరినారాయణన్.. న్యూదిల్లీలో తాగునీరు, పారిశుద్ధ్య విభాగం డైరెక్టర్‌గా నియమితులయ్యారు.




వీరిద్దరినీ వెంటనే రిలీవ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. జె.నివాస్ వెళ్లడంతో ఖాళీ అయిన ఆర్థికశాఖ అదనపు కార్యదర్శి నియామకానికి చర్యలు తీసుకోవాలని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిని సీఎస్ విజయానంద్ ఆదేశించారు. ప్రస్తుతం వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌గా ఉన్న వీరపాండియన్‌కు రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ ఐజీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ ఆదేశాలిచ్చారు.

## పేర్ని నాని పాపం పండింది.. ఇక వదిలేది లేదు

**: మంత్రి కొల్లు రవీంద్ర**




విజయవాడ: వైకాపా నేత పేర్ని నాని పాపం పండిందని.. ఇక వదిలేది లేదని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. ఐదేళ్లు ప్రజలను పీక్కుతిని నేడు పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని మండిపడ్డారు. 2023లో బదిలీ అయిన తహశీల్దార్ 2024లో పట్టాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. పేదలపై ప్రేముంటే 6,400 టిడ్కో ఇళ్లు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. సీఆర్‌జెడ్ భూముల్లో పట్టాలివ్వడాన్ని కోర్టులే తప్పుబట్టాయని గుర్తు చేశారు. 2006లో బందరు పోర్టుని అమ్మేసేందుకు పేర్నినాని ప్రయత్నించారని ధ్వజమెత్తారు. ''నియోజకవర్గానికి పట్టిన అతిపెద్ద శనిగ్రహం పేర్ని నాని. సానుభూతి రాజకీయాలకు కాలం చెల్లింది. తప్పు చేసినవారిని చట్టం వదిలిపెట్టదు. తప్పు చేసి బురద జల్లే ప్రయత్నం చేయటం సిగ్గుచేటు. 8000 బియ్యం బస్తాలు బొక్కి బుకాయించడం హేయం. ఇళ్ల స్థలాల పేరుతో అధిక ధరలకు భూమి కొనుగోలు చేయించి కమీషన్లు దండుకున్నారు. మెడికల్ కాలేజీ భూ కొనుగోలులో రూ.8కోట్ల అక్రమాలు జరిగాయని కాగ్ నివేదిక ఇచ్చింది. ప్రజల పోరాటంతో బందరు పోర్టును సాధించుకున్నాం. గత ఐదేళ్లలో బందరు పోర్టుని ఎందుకు పూర్తి చేయలేదు. 2026 నాటికి పోర్టును కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుంది. బందరుని పర్యాటకం, క్రీడా కేంద్రంగా మార్చేలా చర్యలు తీసుకుంటుంది'' అని కొల్లు రవీంద్ర అన్నారు.

## ఖాతాల్లో 'తల్లికి వందనం' డబ్బులు పడుతున్నాయ్..



*** తెదేపా పోస్ట్**

అమరావతి: ఏపీ ప్రభుత్వం విడుదల చేసిన 'తల్లికి వందనం' నిధులు విద్యార్థుల తల్లులు, సంరక్షకుల ఖాతాలో జమ అవుతున్నాయి. ఈ మేరకు సోషల్ మీడియాలో తెదేపా (TDP) పోస్ట్ చేసింది. ''చెప్పిన విధంగా.. ఇచ్చిన మాట ప్రకారం ఖాతాల్లో 'తల్లికి వందనం' డబ్బులు పడుతున్నాయి'' అని ఆ పార్టీ పేర్కొంది. ఇద్దరు పిల్లలు ఉన్న ఓ లబ్ధిదారు ఖాతాలో రూ.26 వేలు పడ్డాయని పేర్కొంటూ బ్యాంకు నుంచి మొబైల్‌కు వచ్చిన మెసేజ్‌ను తెదేపా పోస్ట్ చేసింది. మరో రూ.4 వేలు స్కూల్ ఖాతాలో పడ్డాయని తెలిపింది. 'తల్లికి వందనం' పథకాన్ని గురువారం నుంచి అమలు చేస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 35,44,459 మంది ఖాతాల్లో నిధులు జమచేస్తున్నట్లు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఒక్కో విద్యార్థికి రూ.15వేల చొప్పున విడుదల చేసింది. ఇందులో రూ.13వేలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు, మిగతా రూ.2వేలను ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం కలెక్టర్ల ఖాతాలకు జమచేస్తున్నారు.

## సాంకేతిక లోపం.. నెల్లూరులో నిలిచిన వందేభారత్ రైలు



నెల్లూరు: హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న వందేభారత్ రైలులో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో 15 నిమిషాలు రైలు నెల్లూరులో నిలిచిపోయింది. సాంకేతిక సమస్యను పరిష్కరించడంతో ఆ తర్వాత రైలు యథావిధిగా బయల్దేరింది. రైలు నిలిచిపోయిన సమయంలో ఏసీ పని చేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

## ఒడిశాలో మావోయిస్టులకు, బలగాలకు ఎదురు కాల్పులు

ఒడిశా లో శుక్రవారం మధ్యాహ్నం నుంచి మావోయిస్టులకు, బలగాలకు ఎదురు కాల్పులు జరుగుతున్నాయి. ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా లోని తెంతులిగూడ సమీపంలోని చిత్రకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టుల సమావేశం జరుగుతుందని భద్రతా బలగాలకు సమాచారం అందింది. మల్కన్‌గిరి జిల్లా పోలీసులు, డిస్ట్రిక్ట్ వాలంటరీ ఫోర్స్ , బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ సంయుక్తంగా మావోయిస్టుల సమావేశాన్ని చుట్టుముట్టారు. ఈ క్రమంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య భారీగా ఎదురు కాల్పులు జరుగుతున్నాయి. కొందరు మావోయిస్టులు తప్పించుకున్నప్పటికీ.. ఏరియా కమిటీ మెంబర్లు కేశా కవాసి రాకేశ్ అలియాస్ సాను కుంజమ్ లను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిపై 5 లక్షల రూపాయల రివార్డ్ ఉంది. ఈ ఆపరేషన్‌లో ఒక పిస్టల్, 6 రౌండ్ల బుల్లెట్లు, 10 డిటోనేటర్లు, 2 స్టీల్ కంటైనర్లు, మావోయిస్ట్ విప్లవ సాహిత్యం స్వాధీనం



చేసుకున్నారు. అయితే ఈ ఎదురు కాల్పుల్లో ఎవరైనా మరణించరా లేదా అని ఇంకా తెలియరాలేదు.

## ఆ ఆలయాన్ని సందర్శించిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు దంపతులు

బెంగుళూరు వయ్యాలికావాలిలోని టీటీడీ శ్రీవారి ఆలయాన్ని చైర్మన్ బీఆర్ నాయుడు దంపతులు శుక్రవారం సందర్శించారు. ముందుగా ఆలయం వద్ద చేరుకున్న చైర్మన్‌కు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి, అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయంలో



ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని చైర్మన్ దంపతులు దర్శించుకున్న తర్వాత రుత్వికులు వేదమంత్రాలతో పట్టువస్త్రంతో సత్కరించి, ఆశీర్వదించారు. అనంతరం చైర్మన్ దంపతులు అన్నప్రసాద కేంద్రంలో భక్తులకు అన్న వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజా విధానాలను గురించి, భక్తులకు కల్పిస్తున్న సదుపాయాల గురించి చైర్మన్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

# మళ్లీ లక్ష దాటేసిన పసిడి..

## ఒక్కరోజే రికార్డు స్థాయిలో పెరిగిన బంగారం ధర



**న్యూఢిల్లీ:** శుక్రవారం భారతదేశంలో బంగారం, వెండి ధరలు గణనీయంగా పెరిగాయి. భారతదేశంలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాములకు రూ.2,120 పెరిగింది. దీనితో బంగారం ధర లక్ష దాటింది. అదే సమయంలో వెండి కూడా తగ్గేదేలే అన్నట్లు ఎగబాకుతోంది. కిలో వెండి ధరపై రూ.1,100 పెరిగింది. ఇటీవల కూడా లక్ష రూపాయలు దాటేసిన పసిడి ధరలు.. తర్వాత క్రమంగా దిగి వచ్చాయి. కానీ మళ్లీ ఇప్పుడు అదే జోరు కొనసాగిస్తోంది. లక్ష రూపాయలు దాటడంతో వినియోగదారులకు కొనేందుకు వెనుకాడుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 3,426.62గా ఉంది. అలాగే 1 గ్రాము బంగారం ధర 110.17గా ఉంది. అదే సమయంలో వెండి ఔన్సుకు 36.06 స్థాయిలో నడుస్తోంది.

ప్రస్తుతం దేశీయంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,01,400 రూపాయలకు చేరుకుంది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధర 92,950 రూపాయల వద్ద ట్రేడవుతోంది. ఇక వెండి ధర విషయానికొస్తే.. కిలో వెండి ధర 1 లక్ష 10 వేల రూపాయల వద్ద కొనసాగుతోంది. ఇక హైదరాబాద్, చెన్నై, కేరళ ప్రాంతాల్లో మాత్రం మరింతగా ఉంది. కిలో వెండి ధర 1 లక్షా 20 వేల వరకు ఎగబాకింది.

## తగ్గనున్న వంట నూనె ధరలు



**న్యూఢిల్లీ:** విపరీతంగా పెరుగుతున్న వంట నూనె ధరలు సామాన్యుల వంటగది బడ్జెట్‌ను పెంచేస్తున్నాయి. సెప్టెంబర్ 2024లో ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని పెంచింది. ఆ తర్వాత అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు కూడా పెరిగాయి. వంటగదిలో ఉపయోగించే నూనె మరింత ఖరీదైనదిగా మారింది. కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఉపశమనం కలిగించే వార్తను అందించింది. ముడి వంట నూనెలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకంని ప్రభుత్వం 20% నుండి 10%కి తగ్గించింది. ఈ తగ్గింపు ముడి పొద్దుతిరుగుడు, సోయాబీన్, పామాయిల్‌పై వర్తిస్తుంది.

### ముడి చమురుపై సుంకాన్ని ఎందుకు తగ్గించారు?

గత కొన్ని నెలలుగా వంట నూనెల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. 2024 సెప్టెంబర్‌లో ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని పెంచింది. ఇది దేశీయ పరిశ్రమను ప్రోత్సహించే లక్ష్యంతో ఉంది. కానీ ఈ నిర్ణయం వ్యతిరేక ప్రభావాన్ని చూపింది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు కూడా పెరిగాయి. రెండింటి మిశ్రమ ప్రభావం భారతదేశంలో వంట నూనెల ధరలు మరింత పెరిగాయి. సామాన్యుడి వంటగదిలో గందరగోళం నెలకొంది. ప్రజలు నూనె బాటిల్ కొనడానికి ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించే పరిస్థితి ఉంది.

దీన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ముడి వంట నూనెలపై కస్టమ్స్ సుంకాన్ని 20% నుండి 10% కు తగ్గించాలని నిర్ణయించింది. ఈ తగ్గింపు ముఖ్యంగా ముడి పొద్దుతిరుగుడు, సోయాబీన్, పామాయిల్‌లకు వర్తిస్తుంది. ఈ నూనెలను భారతదేశంలో వంట కోసం విస్తృతంగా ఉపయోగిస్తారు. ఈ చర్య చమురు ధరలను తగ్గిస్తుందని, వినియోగదారులకు ఉపశమనం కలిగిస్తుందని ప్రభుత్వం విశ్వసిస్తోంది.

ఇప్పుడు ముడి చమురు, శుద్ధి చేసిన చమురు మధ్య సుంకంలో తేడా 8.75% నుండి 19.25%కి పెరగడం అంటే ఏమిటో అర్థం చేసుకుందాం. సరళంగా చెప్పాలంటే, ముడి నూనె అంటే నేరుగా దిగుమతి చేసుకుని శుద్ధి చేయని ఆయిల్. మరోవైపు శుద్ధి చేసిన నూనె అంటే ఇప్పటికే ప్రాసెస్ చేసినది. అలాగే ప్రత్యక్ష వినియోగానికి సిద్ధంగా ఉండేది. గతంలో ముడి ఆయిల్, శుద్ధి చేసిన ఆయిల్ మధ్య సుంకంలో వ్యత్యాసం 8.75% మాత్రమే. అంటే, శుద్ధి చేసిన నూనెను దిగుమతి చేసుకోవడం అంత ఖరీదైనది కాదు. కానీ ఇప్పుడు ప్రభుత్వం ముడి చమురుపై సుంకాన్ని తగ్గించి ఈ వ్యత్యాసాన్ని 19.25%కి తగ్గించింది. దీని కారణంగా కంపెనీలు ఇప్పుడు ముడి ఆయిల్ దిగుమతి చేసుకుని భారతదేశంలోనే శుద్ధి చేయడానికి ఇష్టపడతాయి. ఇది దేశంలో శుద్ధి పరిశ్రమను పెంచుతుంది. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అలాగే శుద్ధి చేసిన నూనెల దిగుమతి తగ్గుతుంది. అలాగే, ముడి ఆయిల్ ధర తగ్గింపు కారణంగా శుద్ధి చేసిన నూనె ధర కూడా తగ్గవచ్చు.

## మాన్‌సూన్ ఆఫర్స్ ప్రకటించిన టాటా..



**న్యూఢిల్లీ:** టాటా మోటార్స్ తమ కస్టమర్ల కోసం దేశవ్యాప్తంగా మాన్‌సూన్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. ఈ క్యాంప్ 500 నగరాల్లో అందుబాటులో ఉంటుంది. అలాగే 1,090 అధీకృత వర్క్ షాప్‌ల ద్వారా మద్దతు ఉంటుంది. జూన్ 20, 2025 వరకు టాటా కస్టమర్లకు రుతుపవన తనిఖీ శిబిరం అందుబాటులో ఉంటుంది. ముఖ్యంగా వర్షాకాలంలో డ్రైవింగ్ పరిస్థితులలో సరైన వాహన పనితీరు, భద్రతను నిర్ధారించడమే లక్ష్యంగా టాటా ఈ సర్వీసును అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ క్యాంపు ద్వారా కస్టమర్లు ఉచిత, సమగ్రమైన వెహికల్ హెల్త్ అంచనాను పొందే అవకాశం ఉంది. ఇందులో ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రత్యేకమైన డయాగ్నస్టిక్స్ పాటు, అవసరమైన వ్యవస్థలను పరిష్కరించే ముప్పైకి పైగా ముఖ్యమైన తనిఖీ పాయింట్లు ఉంటాయి. ఈ కార్యక్రమం ద్వారా కార్ టాప్ వాష్, రియల్ ప్రార్ట్స్, ఇంజిన్ ఆయిల్, ఉపకరణాలు, పొడిగించిన వారంటీలు, కార్మిక ఖర్చుల పై ప్రత్యేక తగ్గింపులను కూడా అందిస్తుంది. అలాగే కస్టమర్లు కొత్త టాటా వాహనాల పై ఆకర్షణీయమైన ఎక్స్ఛేంజ్ ఆఫర్లను సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంది.

అలాగే ఇటీవల టాటా హారియర్ ఈవీ అధికారికంగా రూ.21.49 లక్షల ఎక్స్-షోరూమ్ ప్రారంభ ధరతో ఇటీవల ప్రారంభించారు ఈ లాంచ్‌లో హారియర్ ఈవీ టాటా మోటార్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ నుంచి ప్రీమియర్ ఎలక్ట్రిక్ వాహనంగా స్థిరపడింది. ఈ కొత్త మోడల్ తయారీదారు అభివృద్ధి చేసిన తాజా ఈవీ ఆర్కిటెక్చర్‌తో వస్తుంది. దీనిని యాక్టీ.ఈవీ ప్లస్ అని పిలుస్తుంది. టాటా మోటార్స్ ఆఫర్లకు ఆల్ వీల్ డ్రైవ్ తిరిగి రావడాన్ని సూచిస్తుంది. టాటా హారియర్ ఈవీ మూడు ట్రిమ్ లెవెల్స్‌లో అందుబాటులో ఉంటుంది. అడ్వెంచర్, ఫియర్స్, ఎంపవర్డ్. అలాగే ఈ కారు నాలుగు కలర్ ఆప్షన్లలో వస్తుంది. నైనిటాల్ నాక్టర్నల్, ఎంపవర్డ్ ఆక్సైడ్, ప్యూర్ గ్రే మరియు ప్రిస్టిన్ వైట్, ప్రత్యేక బ్లాక్-అవుట్ స్టీల్ ఎడిషన్‌తో పాటు అందుబాటులో ఉంటుంది. ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ కోసం బుకింగ్ జూలై 2న ప్రారంభం కానున్నాయి. హారియర్ ఈవీ, మహీంద్రా ఎక్స్ఈవీ 9ఈ, అలాగే బీవైడీ అట్టో 3 వంటి వాహనాలతో పోటీపడుతుంది. టాటా హారియర్ ఈవీ కొత్త యాక్టీ.ఈవీ ప్లస్ ఆర్కిటెక్చర్‌తో రిలీజ్ చేశారు. ఇది ఆల్-వీల్ డ్రైవ్ సామర్థ్యాలతో ప్రారంభించి అనేక ఫీచర్స్‌ను అందిస్తుంది. హారియర్ ఈవీ అనేది టాటా మోటార్స్ నుంచి ఏడబ్ల్యూడీ సామర్థ్యాలను అందించే మొదటి ఎలక్ట్రిక్ వాహనంగా ఉంది. గతంలో టాటా సఫారీ, హెక్సా, ఆరియా మాత్రమే టాటా మోటార్స్ నుంచి 4×4 లేదా ఏడబ్ల్యూడీ సామర్థ్యాలతో కూడిన మోడల్స్‌గా ఉన్నాయి. ఎలక్ట్రిక్ వాహనాల్లో అయితే టాటా హారియర్ ఈవీ రెండు బ్యాటరీ ప్యాక్ ఎంపికలు, రెండు మోటార్ కాన్ఫిగరేషన్లతో అందుబాటులో ఉంది.

# 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో స్వర్ణం

## సురుచి సింగ్‌కు హ్యాట్రిక్ మెడల్!





**న్యూయార్క్:** ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో భారత మహిళా షూటర్లు పతకాల వేట కొనసాగిస్తున్నారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో ఎలవేనిల్ వలరివన్. 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్‌లో సిఫ్ట్ కౌర్ సమ్రా కంచు మోత మోగించగా.. శుక్రవారం సురుచి సింగ్ పసిడి పతకంతో దేశం గర్వపడేలా చేసింది. మ్యునిచ్ నగరంలో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్లో గురి చూసి కాల్చిన తను గోల్డ్ మెడల్ కొల్లగొట్టింది. ఈ పోటీల్లో ఆమె వరుసగా మూడో పతకం గెలుపొందడం విశేషం.

ఏప్రిల్ నెలలో బునోస్ ఏరిస్‌లో పసిడితో మెరిసిన సురుచి ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లోనూ గర్జించింది. వ్యక్తిగత విభాగంలో 19 ఏళ్ల అమ్మాయి హ్యాట్రిక్ మెడల్ సాధించింది. ఉత్కంఠ రేపిన ఫైనల్లో సుచీకి ఫ్రాన్స్‌కు చెందిన కమిల్లె జెద్రజెవ్స్కీ నుంచి గట్టి పోటీ ఎదురైంది. చివరి షాట్‌లో భారత షూటర్ 10.5తో 24.19 పాయింట్లు సాధించి అగ్రస్థానం సొంతం చేసుకుంది. దాంతో 9.8 మార్క్‌కు పరిమితమైన కమిల్లె 241.7తో వెండి పతకం అందుకుంది. క్జియాన్‌గ్జన్ యావో(చైనా) కాంస్యంతో మురిసింది.

### సిఫ్ట్.. కంచు మోత

షూటింగ్ వరల్డ్ కప్‌లో పారిస్ ఒలింపిక్ విజేత మనూ బాకర్ తీవ్రంగా నిరాశపరిచింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్లో ఆమె 574 పాయింట్లతో 25వ స్థానంలో నిలిచింది. ఈమధ్యే ఆసియా క్రీడల్లో 453.1 పాయింట్లతో వరల్డ్ రికార్డు నెలకొల్పిన సిఫ్ట్ కౌర్ సమ్రా 8 మంది పోటీపడిన ఫైనల్లో సత్తా చాటింది. పసిడి పతకం వేటలో వెనకబడినా.. కంచు మోతతో దేశం గర్వపడేలా చేసింది. పంజాబ్‌లోని ఫరీద్‌కోటకు చెందిన సిఫ్ట్.

క్వాలిఫికేషన్ రౌండ్‌లో రెండో స్థానంలో నిలిచిన సిఫ్ట్ నీలింగ్, ప్రోన్, స్టాండిగ్.. ఈ మూడు పోటీల్లో 592 పాయింట్లు తెచ్చుకుని ఫైనల్‌కు అర్హత సాధించింది. కానీ, స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోవడంతో కాంస్యంతో సరిపెట్టుకుందీ యువ షూటర్.

### సిఫ్ట్ కౌర్

జూన్ 10 మంగళవారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ పిస్టల్ ఫైనల్లో వలరివన్ కాంస్యంతో మెరిసింది. పసిడిపై గురి పెట్టిన తను చివరకు కంచుమోత మోగించింది. జర్మనీలోని మ్యూనిచ్ వేదికగా క్వాలిఫికేషన్ రౌండ్‌లో అదరగొట్టిన 25 ఏళ్ల ఈ యువకెరటం స్వర్ణ పతకమే లక్ష్యంగా బరిలోకి దిగింది. అయితే.. 231.2 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది.

# నవంబర్ 29 నుంచి ఖోఖో పండుగ..

## తొలిసారి వేలంలో విదేశీ ఆటగాళ్లు..!

**న్యూఢిల్లీ:** రెండు సీజన్లుగా అభిమానులను అలరించిన అల్టిమేట్ ఖో ఖో నవంబర్ 29 నుంచి షురూ కానుంది. మూడో సీజన్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు నిర్వాహకులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రతిష్టాత్మకమైన ఈ టోర్నీలో తొలిసారి విదేశీ ఆటగాళ్లను కూడా అనుమతిస్తామని శుక్రవారం ఖోఖో ఫెడరేషనల్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. ఆసక్తిగల విదేశీ ప్లేయర్లు త్వరలో జరుగబోయే వేలంలో తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని కేకేఎఫ్ఐ అధ్యక్షుడు సుధాన్షు మిట్టల్ వెల్లడించాడు. 'అల్టిమేట్ ఖో ఖో మూడో సీజన్ నవంబర్ 29 నుంచి ప్రారంభం కానుంది. ఈ లీగ్‌కు ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకొని కీలక నిర్ణయం తీసుకున్నాం. ఈసారి వేలంలో పాల్గొనేందుకు విదేశీ ఆటగాళ్లకు కూడా అనుమతి ఇస్తున్నాం. ఈ నిర్ణయంతో లీగ్‌లో పోటీతత్వం మరింత పెరుగుతుంది. అంతేకాదు అంతర్జాతీయంగా భారత్‌ను ఖో ఖో కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవకాశమూ దక్కుతుంది' అని సుధాన్షు తెలిపాడు.




### రెండు సీజన్లలో రన్నరప్

ఐపీఎల్‌తో ఫ్రాంచైజీ క్రికెట్‌కు క్రేజ్ ఓ రేంజ్‌లో పెరిగింది. ఖోఖోకు కూడా అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావాలనే ఆలోచనతో అల్టిమేట్ ఖోఖో లీగ్‌కు శ్రీకారం చుట్టింది హాకీ ఇండియా.

# న్యూజిలాండ్‌తో వైట్‌బాల్ సిరీస్..

## ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్..!





**న్యూఢిల్లీ:** ప్రస్తుతం ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న భారత పురుషుల జట్టు వచ్చే ఏడాది ఆరంభంలో స్వదేశంలో కీలక సిరీస్‌లు ఆడనుంది. జవనరిలో న్యూజిలాండ్ జట్టు భారత పర్యటనకు రానుంది. ఎనిమిది మ్యాచ్‌ల సిరీస్ కోసం కివీస్ రానున్న నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి వేదికలను ఖరారు చేసింది. శుక్రవారం చూచాయగా 8 స్టేడియాలను బీసీసీఐ ఎంపిక చేసింది. ఇందులో ఉప్పల్ స్టేడియం కూడా ఉండడం హైదరాబాద్‌లోని అభిమానులకు తీపికబురులాంటిదే.

న్యూజిలాండ్‌తో భారత జట్టు మూడు వన్డేలు, ఐదు టీ20లు ఆడనుంది. అన్నీ వైట్‌బాల్ మ్యాచ్‌లే కావడంతో ముందస్తుగానే వేదికలను ఖరారు చేసింది భారత బోర్డు. హైదరాబాద్ జైపూర్, మొహాలీ, ఇండోర్, రాజ్‌కోట్, గువాహటి, త్రివేండ్రం, నాగ్‌పూర్ వేదికగా మ్యాచ్‌లు జరపాలని బీసీసీఐ నిర్ణయించింది. జూన్ 14 శనివారం జరుగబోయే బీసీసీఐ సమావేశంలో వేదికలు, మ్యాచ్ తేదీలపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది.

### రెండు టెస్టుల సిరీస్

కివీస్‌తో సిరీస్ అనంతరం అక్టోబర్‌లో వెస్టిండీస్, టీమిండియాల మధ్య రెండు టెస్టుల సిరీస్ జరుగనుంది. ఆ వెంటనే దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాతో వైట్ బాల్ సిరీస్ ఉంటుంది. ఈమధ్యే విండీస్, సఫారీ సిరీస్ వేదికలను మార్చిన విషయం తెలిసిందే. బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో పిచ్, ఔట్ ఫీల్డ్ మరమ్మతుల నేపథ్యంలో వెస్టిండీస్‌తో టెస్టులను అహ్మదాబాద్, ఢిల్లీలో జరపాలని బీసీసీఐ భావిస్తోంది. ఇక దక్షిణాఫ్రికాతో రెండు టెస్టులకు ఈడెన్ గార్డెన్స్, గువహటి వేదిక కానుండగా.. మూడు వన్డేలను రాంచీ, రాయ్‌పూర్, వైజాగ్‌లో నిర్వహించనున్నారు.

# విమాన ప్రమాద మృతులకు సంతాపం..

## లార్డ్స్‌లో నల్లరిబ్బన్లు ధరించిన క్రికెటర్లు




**లార్డ్స్:** అహ్మదాబాద్ విమాన ప్రమాదం పలు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. లండన్‌కు బయల్దేరిన విమానం టేకాఫ్ అయిన నిమిషాల్లోనే చెట్టును ఢీకొని.. సమీపంలోని వైద్య కళాశాల హాస్టల్ భవనంపై కూలింది. యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిన ఈ ఘటనపై పలు దేశాల నాయకులు సంతాపం తెలియజేశారు. లార్డ్స్ మైదానంలో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఆడుతున్న ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా ఆటగాళ్లు సైతం సంతాపం తెలిపి.. నల్ల రిబ్బన్లు ధరించారు.

గురువారం మధ్యాహ్నం అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా బోయింగ్ 787-8 డ్రీమ్ లైనర్ విమాన ప్రమాదం 241 మందిని పొట్టనబెట్టుకుంది. ఈ నేపథ్యంలో డబ్ల్యూటీసీ ఫైనల్ మూడో రోజు ఆసీస్, సఫారీ ఆటగాళ్లు మృతులకు సంతాపం తెలిపారు. తొలి సెషన్ ప్రారంభానికి ముందు ఇరుజట్ల ఆటగాళ్లు, స్టేడియంలోని ప్రేక్షకులు అందరూ నిల్చొని నిమిషం సేపు మౌనం పాటించారు. ఆ తర్వాత భుజానికి నల్ల రిబ్బన్లు కట్టుకొని మైదానంలోకి దిగారు దక్షిణాఫ్రికా ప్లేయర్లు. ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న భారత క్రికెటర్లు సైతం మృతుల కుటుంబాలకు సంఘీభావం తెలుపుతూ ఒక నిమిషం పాటు మౌనం పాటించారు. ఆతిథ్య జట్టుతో ఐదు టెస్టుల సిరీస్ ఆడనున్న టీమిండియా శుక్రవారం ఇంట్రా స్క్వాడ్‌తో ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది.

### 24 మంది మెడికోలు

గురువారం మధ్యాహ్నం ఎయిరిండియా బోయింగ్ 787-8 విమానం లండన్‌కు బయల్దేరింది. అందులో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటీషర్లు, 8 మంది పోర్చుగల్ దేశస్థులు సహా కెనడాకు చెందిన ఒకరు అయితే.. టేకాఫ్ అయిన 2-3 నిమిషాల్లోనే చెట్టును ఢీకొని సమీపంలోని వైద్య కళాశాల వసతి గృహం భవంతిమీద పడిపోయింది. అనంతరం భారీ పేలుడుతో విమానం తునాతునకలైంది. ఈ ఘటనలో వైద్య కళాశాలలోని 24 మంది మెడికోలు ప్రాణాలు విడిచారు. యావత్ ప్రపంచాన్నిఉలిక్కిపడేలా చేసిన ఈ ప్రమాదంలో ఒకేఒక్కడు మృత్యుంజయుడిలా బయటపడ్డాడు. శవాల దిబ్బగా మారిన ఘటనా స్థలం నుంచి రమేశ్ విశ్వకుమార్ అనే 38 ఏళ్ల వ్యక్తి నడుచుకుంటూ అంబులెన్స్ వరకూ వెళ్లాడు. ప్రస్తుతం అతడికి చికిత్స అందిస్తున్నారు. ఊహించుకోవడానికే వణుకు పుట్టే ఈ ప్రమాదంలో రమేశ్ ప్రాణాలతో ఉండడం నిజంగా అద్భుతం.

# చార్మింగ్ అదితి..

టాకీస్: అదితి శంకర్.. హీరోయిన్, నేపథ్య గాయని. ఎక్కువగా తమిళ చిత్రాలలో పని చేస్తుంది. తరుచూ సామజిక మాధ్యమాల్లో యాక్టీవ్ గా ఉంటూ తన అభిమానులను ఖుషి చేస్తుంది ఈ వయ్యారి భామ. తాజాగా ఈ బ్యూటీ సోషల్ మీడియాలో కొన్ని ఫోటోలను షేర్ చేసింది. ఈ ఫోటోలను చూసిన కుర్రాళ్లు వీటికి లైక్స్ కొడుతూ వైరల్ చేస్తున్నారు. 6 జూలై 1997న తమిళనాడు రాజధాని చెన్నైలో జన్మించింది. ఆమె భారతీయ చలనచిత్ర నిర్మాత ఎస్. శంకర్ కుమార్తె. ఆమెకు ఒక అక్క ఐశ్వర్య శంకర్ మరియు ఒక తమ్ముడు, అర్జిత్ శంకర్ కూడా ఉన్నారు.

శ్రీరామచంద్ర యూనివర్సిటీలో మెడికల్ డిగ్రీ పూర్తి చేసింది ఈ ముద్దుగుమ్మ. గ్రాడ్యుయేషన్ తర్వాత ఆమె తన తల్లిదండ్రులకు కారణంగా నటన పట్ల ఇష్టాన్ని పెంచుకొని హీరోయిన్ గా సినిమాల వైపు అడుగులు వేసింది. 2022లో శివకార్తికేయన్ సరసన తమిళ మసాలా చిత్రం విరుమాన్ సినిమాతో కథానాయకిగా చలనచిత్ర అరంగేట్రం చేసింది. ఈ సినిమాలో ఈ వయ్యారి నటనకి ఉత్తమ తొలి నటిగా అవార్డు గెలుచుకుంది. ఇది తెలుగులో మహావీరుడిగా విడుదలైంది. 2022లో వరుణ్ తేజ హీరోగా తెలుగు స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా చిత్రం గనిలో థమన్ మ్యూజిక్ అందించిన "రోమియో జూలియట్" అనే పాట ఆలపించింది. మహావీరుడు (డి) "బంగారుపేటలోన" అని మరో తెలుగు పాట పడింది. ఈ ఏడాది బైరవం సినిమాతో తెలుగులో అరంగేట్రం చేసింది ఈ సుకుమారి. ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. వన్స్ మోర్ అనే ఓ తమిళ చిత్రంలో కూడా నటిస్తుంది. ఈ చిత్రీకరణ పూర్తయింది. ఇది త్వరలోనే విడుదల కానుంది.



# కూలీలో ఉంది నేనేనా అన్న అనుమానం

## నటుడు నాగార్జున వెల్లడి



టాకీస్: టాలీవుడ్ అగ్ర కథానాయకుడు నాగార్జున ప్రస్తుతం రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఇప్పటికే 'కుబేర' విడుదలకు సిద్ధం కాగా.. మరోవైపు ఆయన నటించిన 'కూలీ' చిత్రం కూడా ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ రెండు సినిమాలకు సంబంధించి తాజాగా ఆసక్తికర విషయాలను పంచుకున్నారు నాగార్జున. ఒక ఇంటర్వ్యూలో నాగార్జున మాట్లాడుతూ.. దర్శకుడు శేఖర్ కమ్ముల అంటే తనకెంతో అభిమానమని తెలిపారు. తనతో 15 ఏళ్లుగా సినిమా చేయాలని చూస్తున్నాను. 'కుబేర'తో ఆ కల నెరవేరింది. శేఖర్ చిత్రాలు మిగతా సినిమాలకంటే చాలా భిన్నంగా ఉంటాయి. అయితే 'కుబేర' కథతో నా దగ్గరికి వచ్చినప్పుడు నేను షాక్ అయ్యాను. శేఖర్... నువ్వు నిజంగానే ఈ సినిమా చేయాలనుకుంటు న్నావా?' అని అడిగాను. అప్పుడు శేఖర్ అవును అని తెలిపాడు. 'కుబేర' కోసం శేఖర్ ఎంతో రీసెర్చ్ చేశాడు. ఈ సినిమాలో ఆయన చెప్పిన కొన్ని ఆసక్తికర విషయాలు విని నేనే షాక్ అయ్యాను. న్యాయంపై ఆయనకు బలమైన నమ్మకం ఉంది. ఏదో ఒక స్కామ్‌నో లేదా ఏ ఒక్కరినో ఆధారంగా చేసుకొని ఈ కథ రాయలేదు. సమాజంలో చూస్తున్న విషయాలనే ఇందులో చెప్పారు. పేద, ధనిక, మధ్యతరగతి కుటుంబాల్లో ఏం జరుగుతుందనే దాన్ని ఇందులో చూపించారు. తాను అనుకున్న కథను చాలా అందంగా స్క్రీన్ మీదకు తీసుకువచ్చాడని నాగార్జున చెప్పుకొచ్చారు. ఇక 'కూలీ' సినిమా విషయానికి వస్తే, ఈ చిత్రంలో నా పాత్ర కీలకంగా ఉండబోతుంది. ఈ సినిమాలో నన్ను నేను చూసుకుని షాక్ అయ్యాను. దర్శకుడు లోకేష్ కనగరాజ్ నన్ను కొత్తగా చూపించబోతున్నాడు. ఇది పూర్తిగా మాస్ ఎంటర్-టైనర్‌గా రాబోతోంది అంటూ నాగార్జున వివరించారు.

# కుబేరా ప్రీఈవెంట్ వాయిదా... 15కు రీషెడ్యూల్




టాకీస్: ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల రూపొందించిన చిత్రం 'కుబేర ప్రీ రిలీజ్ ఈవెంట్ వాయిదా పడింది. అహ్మదాబాద్ విమానప్రమాదం కారణంగా వాయిదా వేశారు. ధనుష్, రష్మిక ,నాగార్జున కీలక పాత్రలో నటించారు. త్వరలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానున్న నేపథ్యంలో శుక్రవారం 'కుబేర' ఈవెంట్ నిర్వహించాలని టీమ్ భావించింది. గురువారం జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం దృష్ట్యా ఆ ఈవెంట్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను తిరిగి జూన్ 15న ఆదివారం సాయంత్రం నిర్వహించనున్నట్లు చెప్పింది. ముందు అనుకున్నవిధంగానే హైదరాబాద్‌లోనే ఈ కార్యక్రమం జరగనుందని తెలిపింది. సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్‌మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన వ్యక్తికి.. వీధుల్లో జీవించే ఓ అతి పేదవాడికి మధ్య జరిగే సంఘర్షణే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. ఇందులో హవాలా, మనీలాండరింగ్ తదితర అంశాలు మిళితమై ఉంటాయి. దీంట్లో నటులు ఎక్కడా కనిపించరు. కేవలం పాత్రలు మాత్రమే కనిపిస్తాయని పుస్కుర్ రామ్‌మోహన్‌రావు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో దీనిని విడుదల చేయనున్నట్లు చెప్పారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన 'కుబేర' ఈనెల 20న విడుదల కానుంది.

# జూన్ 22న జననాయగన్ గ్లింప్స్ విడుదల




టాకీస్: తమిళ సూపర్ స్టార్ దళపతి విజయ్ మరికొన్ని రోజుల్లో సినిమాలు దూరమవుతున్న విషయం తెలిసిందే. గత ఏడాది రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన విజయ్ తమిళ వెట్రి కళగం అనే పార్టీని స్థాపించాడు. ఇక నుంచి తాను పూర్తిగా రాజకీయల్లోనే ఉంటానని.. ఇదే తన చివరి చిత్రం అంటూ దళపతి69 ప్రాజెక్టను ప్రారంభించాడు. జన నాయగన్ (ప్రజల నాయకుడు) అనే టైటిల్‌తో వస్తున్న ఈ ప్రాజెక్టను కార్తీ సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న హెచ్.వినోద్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి తాజాగా ఒక సాలిడ్ అప్‌డేట్ వచ్చింది. మరో 8 రోజుల్లో విజయ్ పుట్టినరోజు రాబోతుంది. ఈ సందర్భంగా అభిమానుల కోసం మేకర్స్ భారీ సర్‌ప్రైజ్ ప్లాన్ చేసినట్లు- తెలుస్తుంది. జూన్ 22న జననాయగన్ ఫస్ట్ గ్లింప్సను మేకర్స్ విడుదల చేస్తున్నట్లు- సమాచారం. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందించనుండగా.. కన్నడ టాప్ బ్యానర్ కేవీఎన్ ప్రోడక్షన్ ఈ మూవీని నిర్మిస్తుంది. పూజ హెగ్డేతో పాటు- ప్రేమలు ఫేమ్ మమితా బైజు ఈ సినిమాలో కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమాను జనవరి 09 2026న వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ఇప్పటికే వెల్లడించింది.

# రామ్‌చరణ్‌తో త్రివిక్రమ్ మూవీ లేనట్లేనా?



టాకీస్: రామ్ చరణ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఒక సినిమా రూపొందే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. నిజానికి అదేమీ లేదని అర్థమయ్యేలా త్రివిక్రమ్ తరపున నిర్మాత నాగ వంశీ ఒక ట్వీట్ వేశాడు. ప్రస్తుతానికి వెంకటేష్, జూనియర్ ఎన్టీఆర్ సినిమాలను మాత్రమే త్రివిక్రమ్ ఫైనల్ చేశారని, ఆయనకు సంబంధించిన ఏ అప్‌డేట్ అయినా తాను సోషల్ మీడియా వేదికగా వెల్లడిస్తానని చెప్పాడు. అయితే, రామ్ చరణ్‌తో సినిమా ఉంటుందా, ఉండదా అనే చర్చపై అనేక వార్తలు వస్తున్నాయి. కానీ, ఇప్పట్లో రామ్ చరణ్ త్రివిక్రమ్‌తో సినిమా చేసే అవకాశం లేదు. ప్రస్తుతం రామ్ చరణ్, బుచ్చిబాబు దర్శకత్వంలో పెద్ది అనే సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమా పూర్తయిన వెంటనే సుకుమార్ దర్శకత్వంలో మరో సినిమా సైన్ చేశాడు. ఆ సినిమా పూర్తయిన తర్వాత త్రివిక్రమ్‌తో సినిమా చేయాలనుకున్నాడు, కానీ కొన్ని అంతర్గత కారణాల వల్ల ఆ సినిమాను పక్కన పెట్టేశాడు.

# జూలై18న విడుదల కానున్న హరిహరవీరమల్లు?

టాకీస్: ఎన్నో వాయిదాల తర్వాత హరిహర వీరమల్లు సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తుందని అందరూ భావించిన తరుణంలో, సిజీ వర్క్స్ పూర్తి కాకపోవడంతో సినిమాను నిరవధికంగా వాయిదా వేశారు. నిజానికి, ఈ సినిమా 12న రిలీజ్ కావాల్సి ఉంది. విజువల ఎఫెక్ట్స్ కోసం రిలీజ్ చేయడం లేదని అనౌన్స్ చేశారు. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాను వచ్చే నెల 18వ తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాను డైరెక్టర్ క్రిష్ మొదలుపెట్టారు, కానీ బడ్జెట్ సమస్యల కారణంగా ఆయన తప్పుకోవడంతో, నిర్మాత ఏ.ఎమ్. రత్నం కుమారుడు జ్యోతి కృష్ణ దర్శకత్వం వహించి సినిమాను పూర్తి చేశాడు. ఈ సినిమా రెండు భాగాలుగా రూపొందుతోంది. మొదటి భాగం ఇప్పుడు రిలీజ్‌కు సిద్ధమవుతోంది. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా వచ్చే నెల రిలీజ్ అయితే, ఈ నెల మొత్తం బాక్స్ ఆఫీస్ కాస్త డల్‌గానే ఉండే అవకాశం కనిపిస్తుంది. తెలంగాణ రాబిన్ హుడ్‌గా పేరున్న పండుగ సాయన్న బయోపిక్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు- గతంలో ప్రచారం జరిగింది. మొగల్ కాలంలో వారిని ఎదిరించి, దోచి, పేదలకు పంచిపెట్టాడని ప్రచారం ఉంది.



# పెళ్లి పీటలు ఎక్కబోతున్న 'చిన్నారి పెళ్లికూతురు'

## ప్రియుడు మిలింద్ చాంద్వానీతో ఎంగేజ్‌మెంట్





టాకీస్: తెలుగు టీవీ ప్రేక్షకులకు 'చిన్నారి పెళ్లికూతురు'గా పరిచయమై... సిల్వర్ స్క్రీన్ పై హీరోయిన్ గా దగ్గరైన యువనటి 'అవికా గోర్' తన జీవితంలో ఓ ముఖ్యమైన ఘట్టానికి అడుగులు వేశారు. తన ప్రియుడు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ మిలింద్ చాంద్వానీని పెళ్లాడబోతున్నారు. మిలింద్ తో నిశ్చితార్థం జరిగినట్లు ఆమె అధికారికంగా ప్రకటించారు. ఈ వార్తతో ఆమె అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గత కొంతకాలంగా అవికా గోర్, మిలింద్ చాంద్వానీ ప్రేమలో ఉన్న సంగతి అందరికీ తెలిసిందే. వీరిద్దరూ కలిసి దిగిన ఫొటోలు, వారి మధ్య ఉన్న సాన్నిహిత్యం సోషల్ మీడియాలో తరచూ కనిపిస్తూనే ఉంటాయి. తమ ప్రేమ బంధాన్ని తదుపరి స్థాయికి తీసుకెళ్తూ, వీరిద్దరూ ఇప్పుడు నిశ్చితార్థం చేసుకున్నారు. ఈ విషయాన్ని అవికా గోర్ స్వయంగా తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. "ఇది నిజమైన శుభవార్తే" అంటూ ఓ పోస్ట్ ద్వారా తన సంతోషాన్ని పంచుకున్నారు. నిశ్చితార్థానికి సంబంధించిన కొన్ని ఫొటోలను కూడా అవికా షేర్ చేశారు. ఒక ఫొటోలో మిలింద్ చేతిని పట్టుకుని ఆనందంగా నవ్వుతూ కనిపించగా, మరో ఫొటోలో మిలింద్ బుగ్గపై ముద్దుపెడుతూ తన ప్రేమను వ్యక్తం చేశారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కొద్దిసేపటికే వైరల్‌గా మారాయి. అభిమానులు, పలువురు ప్రముఖులు అవికా గోర్, మిలింద్ చాంద్వానీ జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. త్వరలోనే వీరి వివాహం జరగనున్నట్లు సమాచారం. అయితే, పెళ్లి తేదీకి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.